


# విజయభాను

45 వ వార్షికోత్సవం విజయభాను

విశాఖపట్నం, శుక్రవారం 02-09-2022 VIJAYABHANU DAILY * VISAKHAPATNAM సంపుటి : 45 సంచిక : 296 పేజీలు : 08 వెల : 1 రూపాయి

## ఆదాయార్జన శాఖలపై సీఎం జగన్ సమీక్ష



**అమరావతి,** (విజయభాను న్యూస్) :ఆదాయార్జన శాఖపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తాడేపల్లిలోని తన క్యాంప్ కార్యాలయంలో గురువారం సమీక్ష చేపట్టారు. మైనింగ్, రెవెన్యూ, ఎక్సైజ్, ట్రాన్స్‌పోర్ట్, రిజిస్ట్రేషన్ శాఖల అధికారులతో సమీక్షించారు. ఈ సమీక్షా సమావేశానికి మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ధర్మాన ప్రసాదరావు, నారాయణ స్వామి, విశ్వరూప్, ఆయా శాఖల అధికారులు హాజరయ్యారు.

## యూపీఎస్సీ నిర్వహించబోతున్న పోటీ పరీక్షలకు పకడ్బంధీగా ఏర్పాట్లు

### జిల్లా రెవెన్యూ అధికారి శ్రీనివాస మూర్తి





విశాఖపట్నం (విజయభాను న్యూస్) : యూపీఎస్సీ నిర్వహించబోతున్న పోటీ పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి శ్రీనివాస మూర్తి అధికారులను ఆదేశించారు. గురువారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో యూపీఎస్సీ పరీక్షలకు సంబంధించి నిర్వహణ ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఆర్ఓ మాట్లాడుతూ ఈనెల 4 వ తేదీ న ఆదివారం నాడు యూపీఎస్సీ కి సంబందించి నేషనల్ డిఫెన్స్ అకాడమీ, నావల్ అకాడమీ ఎగ్జామినేషన్ (II), మరియు కంబైన్డ్ డిఫెన్స్ సర్వీస్ (II) పరీక్షలు జరుగనున్నాయని తెలిపారు. ఈ పరీక్షకు 6526 మంది అభ్యర్థులు జిల్లాలో హాజరుకానున్నట్లు తెలిపారు. అభ్యర్థులు, రూట్ ఆఫీసర్లు, ఇన్విజిలేటర్లు కోవిడ్ నిబంధనలు, యూపీఎస్సీ గైడ్ లైన్స్ తు.చా తప్పకుండా పాటించాలని జిల్లా రెవెన్యూ అధికారి శ్రీనివాస మూర్తి సంబంధిత అధికారులను

## విజయానికి షార్ట్ కట్స్ ఉండవు

### - ఎంపీ విజయసాయిరెడ్డి



**సత్యసాయి జిల్లా :** (విజయభాను న్యూస్) : పిల్లల చదువు బాధ్యత నాదే అన్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని వైఎస్సార్‌సీపీ ఎంపీ విజయ సాయిరెడ్డి అన్నారు. గోరంట్ల బెస్ట్ ఇన్నోవేషన్ ప్రైవేట్ వర్సిటీ స్నాతకోత్సవంలో ఆయనతో పాటు, బీజేపీ నేత రాంమాధవ్ పాల్గొన్నారు.

ఈ సందర్భంగా విజయసాయిరెడ్డి మాట్లాడుతూ, విద్య, వైద్య రంగాలకు సీఎం జగన్ అధిక ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. నవరత్నాలతో ప్రజలకు సంక్షేమ ఫలాలు అందుతున్నాయన్నారు.

“పేదరికంతో ఏ ఒక్కరూ చదువుకు దూరం కాకూడదన్నదే సీఎం వైఎస్ జగన్ ఆశయం. విజయానికి షార్ట్ కట్స్ ఉండవు. కష్టపడితే సక్సెస్ సాధ్యం. ఇంటర్నెట్ యుగంలో విద్యార్థులకు అపార అవకాశాలు ఉన్నాయి. వాటిని సద్వినియోగం చేసుకోవాలని” విజయసాయిరెడ్డి అన్నారు.

## దేశంలోనే మొట్టమొదటి ‘వర్చువల్ పాఠశాల’ ప్రారంభం..

దిల్లీ: విద్యావ్యవస్థను బలోపేతం చేసేందుకు దిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ మరో ముందడుగు వేశారు. దేశంలోనే తొలి వర్చువల్ పాఠశాలను కేజ్రీవాల్ బుధవారం ప్రారంభించారు. భౌతికంగా పాఠశాలకు వెళ్లలేని పరిస్థితుల్లో ఉన్నవారికి ఇదో సదావకాశంగా ఆయన పేర్కొన్నారు. దిల్లీ బోర్డ్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్‌కు అనుబంధంగా నడవనున్న ఈ స్కూల్ అడ్మిషన్లు నేటి నుంచి ప్రారంభయ్యాయి. జేఈఈ, నీట్, సీయూఈటీ పరీక్షలకు కూడా ప్రత్యేక శిక్షణ ఇవ్వనుండటం విశేషం. ఈ వర్చువల్ స్కూల్‌ను ప్రారంభిస్తూ కేజ్రీవాల్ మాట్లాడారు. ‘దేశంలోనే మొట్టమొదటి వర్చువల్ స్కూల్‌ను నేడుప్రారంభించాం. నేటి నుంచి 9-12వ తరగతి వరకు అడ్మిషన్లు ప్రారంభమయ్యాయి. దేశంలోని ఎక్కడి విద్యార్థి అయినా ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవచ్చు. జేఈఈ, నీట్, సీయూఈటీ పరీక్షలకు నిపుణులతో శిక్షణ ఇప్పిస్తాం. పలు

తరువాయి 2లో..



## భవిష్యత్ ఆవిష్కర్తలను తయారు చేయాలి

### - ఇంక్యుబేటర్ మేనేజర్స్ ట్రైనింగ్ ప్రోగ్రాం ప్రారంభం

### - మూడు రాష్ట్రాల నుంచి పాల్గొన్న ప్రతినిధులు



ఆంధ్రవిశ్వవిద్యాలయం (విజయభాను న్యూస్) :

భవిష్యత్ ఆవిష్కర్తలను తయారు చేయాల్సిన అవసరం ఉందని ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి అన్నారు. ఏయూలోని అమెరికన్ కార్నర్‌లో రెండు రోజుల ఇంక్యుబేటర్ మేనేజర్స్ ట్రైనింగ్ ప్రోగ్రాంను ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ ఇంటర్నెట్ ప్రపంచ స్వరూపాన్ని మార్చివేసిందన్నారు. ఇంటర్నెట్ అందరికీ అందుబాటులోనికి రావడం వెనుక జరిగిన పరిశోధనను ఒక్కసారి గుర్తుచేసుకోవాలన్నారు. కంప్యూటర్‌తో పరిచయం లేని వ్యక్తులు సైతం ఎంతో ప్రభావంతమైన మార్పులకు ఆద్యులుగా నిలచిన సంఘటనలను ఉదహరించారు. నేటి తరానికి ఆవిష్కర్తలుగా మార్చడానికి అవసరమైన మార్గాన్ని నిర్మించామన్నారు. ఆలోచనే నేడు నిజమైన సంపదగా నిలుస్తుందనే విషయం గుర్తుంచుకోవాలన్నారు. ఇంక్యుబేషన్, ఇన్నోవేషన్‌కు అనువైన పరిస్థితుల కల్పన చేయడం ప్రధానమన్నారు. భవిష్యత్ ఆవిష్కర్తలు సమాజం నుంచి, ముఖ్యతనుంచి రావాల్సిన అవసరం ఉందన్నారు.

దీనికి రాష్ట్ర ప్రభుత్వాలతో పాటు

తరువాయి 2లో..

## కేంద్రం ఇస్తామన్నా ఎందుకు తీసుకోవడం లేదో జగనే చెప్పాలి


### భాజపా రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు



**విజయవాడ :** ఆంధ్రప్రదేశ్‌కు బల్క్ డ్రగ్ పార్కును కేటాయించడం ద్వారా రాష్ట్రాభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం చొరవ చూపిస్తుంటే వైకాపా ప్రభుత్వం మాత్రం అవసరమైన చర్యలు తీసుకోవడం లేదని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు అన్నారు. విజయవాడలో సోము వీర్రాజు మీడియాతో మాట్లాడారు. రాష్ట్రానికి కేంద్రం ఇస్తున్న హార్డ్‌వేర్ పార్కు, పెట్రో కెమికల్ కాంప్లెక్స్‌లను ఎందుకు తీసుకోవడం లేదో సీఎం జగన్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. హార్డ్‌వేర్ పార్కు కోసం కేటాయించిన భూములను ఇళ్ల స్థలాలకు కేటాయించడాన్ని

తరువాయి 2లో..

## ఎన్డీయేలో చేరికపై వారే జవాబు చెప్పాలి



**అమరావతి, (విజయభాను న్యూస్) :** ఎన్డీయేలో చేరతారన్న ప్రచారంపై స్పందించేందుకు తెదేపా అధినేత చంద్రబాబు నాయుడు నిరాకరిం చారు. ఆ ప్రచారం చేసేవారే దానికి జవాబు చెప్పాల న్నారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ... రాష్ట్ర ప్రయోజనాల కోసమే గతంలో ఎన్డీయే నుంచి బయటకు వచ్చామని గుర్తు చేశారు. రాష్ట్ర ప్రయోజనాల కోణంలోనే కేంద్ర రాజకీయా లను చూస్తామని స్పష్టం చేశారు. పాలనపై ఎక్కువ దృష్టి పెట్టడం వల్ల పార్టీ రెండుసార్లు నష్టపోయిందని అభిప్రాయ పడ్డారు.

రాష్ట్రానికి మంచిపేరు తేవాలనే తపనతో వ్యక్తిగతంగా ఎంతో

తరువాయి 2లో..




## జివిఎంసి మేయర్, కమిషనర్ ను కలిసిన జలంధర్ జర్నలిస్టులు

### - ఏక్ భారత్ - శ్రేష్ట్ భారత్ కార్యక్రమం పై చర్చ

### - జలంధర్ జర్నలిస్టులతో మేయర్ , కమిషనర్



విశాఖపట్నం, (విజయభాను న్యూస్) : భారత ప్రభుత్వ సమాచార ప్రసార మంత్రిత్వ శాఖ వారి ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో తరపున జలంధర్ నుండి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి విచ్చేసిన జర్నలిస్ట్ బృందంతో మేయర్, కమిషనర్ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా వారిరువురూ మాట్లాడుతూ జివిఎంసి నగరంలో చేపడుతున్న ఘన, ద్రవ వ్యర్థాల నిర్వహణపై వివరించారు. విశాఖ నగరంలో దాదాపు 5.80 లక్షల హౌస్ హోల్డర్స్, 24 లక్షల జనాభా, ప్రతి రోజూ 35 వేల మంది పర్యాటకులు నగరానికి వస్తుంటారని తెలిపారు. అందమైన విశాఖ నగరానికి ఎంతో మంది పర్యాటకులు వస్తారని, వారికి మంచి ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించడం జరుగుతుందని తెలిపారు. నగరంలోల ముఖ్యంగా భారత దేశంలో ప్రప్రథమంగా నీటిపై తేలియాడే ఫ్లోటింగ్ సోలార్ వ్యవస్థను ఏర్పాటుచెయడమైనదన్నారు. పారిశుధ్యం నిర్వహించుటకు సుమారు ఐదు వేల మంది కార్మికులు పని చేస్తున్నారని, స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ లో భాగంగా “క్లాప్” వాహనాల ద్వారా ప్రతి రోజూ ఇంటింటి నుండి తడి - పొడి చెత్త సేకరణ జరుగుతుందని, అలా సేకరించిన వ్యర్థాలను కాపులుప్పాడ డంపింగ్ యార్డుకు తరలించి తద్వారా విద్యుత్ ఉత్పత్తి, ఎరువులు, బ్రిక్స్ మొదలైనవి తయారు చేయుటకు ఉపయోగించడం జరుగుతుందని తెలిపారు. భూగర్భ మురుగునీటిని ఎస్టిపి

తరువాయి 2లో..

# 73, 76 వార్డులలో పర్యటించిన జివిఎంసి కమిషనర్





విశాఖపట్నం (విజయభాను న్యూస్) :

మొబైల్ గణేష్ నిమజ్జనం నీటి తొట్టెలకు విశేష స్పందన లభించింది. జివిఎంసి కమిషనర్ డాక్టర్ జి. లక్ష్మీశ తెలిపారు. గురువారం ఆయన క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా 6వ జోన్, 73, 76వ వార్డులలో జివిఎంసి ఏర్పాటుచేసిన గణేశ ప్రతిమల నిమజ్జన నీటి తొట్టెలను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ 73వ వార్డులో ఏర్పాటుచేసిన మొబైల్ గణేశ నిమజ్జనం నీటి తోట్టెలకు ప్రజల నుండి ఆదరణ బాగుందని, ప్రజల సౌకర్యార్థం వచ్చే సంవత్సరం ప్రతి వార్డులో కూడా ఇటువంటి నిమజ్జన నీటి తొట్టెలను ఏర్పాటు చేస్తామని తెలిపారు. పర్యావరణాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రజలు సహకరిస్తున్నారని ఈ సందర్భంగా గుర్తుచేశారు. అనంతరం ఆ వార్డులో ఉన్న పార్క్ ను సందర్శించి పార్కులో సందర్శకులకు ఆహ్లాదంగా కలిగించే వాతావరణం కల్పించాలని, పార్కులో మరమ్మతులు ఏమైనా ఉంటే తక్షణమే పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. వార్డులో కాలువలు, డ్రైన్లు ఎప్పటికప్పుడు శుభ్రపరచాలని, రోడ్లపై ఉన్న చెత్త పోగులను ఎప్పటికప్పుడు తొలగించాలని శానిటరీ ఇన్స్పెక్టర్ ను ఆదేశించారు.

తదుపరి 76వ వార్డులో ఏర్పాటుచేసిన ప్లాస్టిక్ రహిత విఘ్నేశ్వర మండపాన్ని సందర్శించి పూజలు చేశారు. విఘ్నేశ్వర మండపం ధర్మకర్తలు కమిషనర్ ను శాలువా కప్పి సత్కరించారు. ఈ సందర్భంగా మండపం వద్ద గుడ్డ సంచులను పంపిణీ చేస్తూ పర్యావరణ హితమైన వినాయక ప్రతిమలను నగరం మొత్తం ప్రజలు పూజించారని, ఈ సందర్భంగా జివిఎంసి తరఫున కమిషనర్ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు.

ఈ పర్యటనలో ప్రధాన వైద్యాధికారి డాక్టర్ కెఎస్ఎల్జి శాస్త్రి, జోనల్ కమిషనర్ పి. సింహాచలం, ఏసిపి ఐ.వి. రమణ మూర్తి, కార్యనిర్వాహక ఇంజనీర్ ప్రసాద్ బాబు, ఎఎంఓహెచ్ డాక్టర్ రాజేష్, ఇతర జివిఎంసి సిబ్బంది, సచివాలయ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

# సిపిఎస్ రద్దు చేయాలి



గాజువాక, (విజయభాను న్యూస్) : సిపిఎస్ రద్దుచేసి, ఓ పి ఎస్ అమలు చేయాలని స్టీల్ సిఐటియు అధ్యక్ష ప్రధాన కార్యదర్శి జె అయోధ్యరామ్, వైటీ దాస్ డిమాండ్ చేశారు. గురువారం స్టీల్ సిఐటియు ఆధ్వర్యంలో స్టీల్ ప్లాంట్ ప్రధాని పరిపాలన భవనం ఎదుట ఈ డిమాండ్ పై ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాను ఉద్దేశించి స్టీల్ సిఐటియు అధ్యక్షులు జె అయోధ్యరామ్ మాట్లాడుతూ నాడు జగన్మోహన్ రెడ్డి పాదయాత్రలో ఇచ్చిన హామీని నిలబెట్టుకోమని నేడు అడుగుతున్న ఉపాధ్యాయులపై పోలీసులు జరుపుతున్న ధమనకాండను తీవ్రంగా ఖండించారు. సమాజానికి అవసరమైన భావి భారత పౌరులను తయారు చేస్తున్న ఉపాధ్యాయులపై ఇటువంటి చర్యలకు పాల్పడటం దుర్మార్గమని ఆయన అన్నారు. కనుక ఇప్పటికైనా ప్రభుత్వం తన ఆలోచనను మార్చుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. నగర సిఐటియు ఉపాధ్యక్షులు ఎన్ రామారావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ఆదేశాలను తూచా తప్పకుండా రాష్ట్ర ప్రభుత్వం పాటిస్తోందని ఆయన తీవ్రంగా విమర్శించారు. అందులో భాగంగానే రైతులకు మీటర్లను, నేడు ప్రభుత్వ ఉద్యోగులపై జరుగుతున్న తీవ్ర నిర్బంధమని ఆయన అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మేతక వైఖరిని చూస్తే స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ పై కేంద్ర ప్రభుత్వానికి రాసిన లేఖ పై కూడా అనుమానాలు వస్తున్నాయని ఆయన అన్నారు. కనుక రాష్ట్ర ప్రభుత్వం తన వైఖరిని మార్చుకొని తన రాష్ట్రాన్ని, తన వారిని కాపాడుకునే దిశగా అడుగులు వేయాలని ఆయన డిమాండ్ చేశారు. స్టీల్ సిఐటియు ప్రధాన కార్యదర్శి వై టి దాస్ మాట్లాడుతూ సిపిఎస్ ద్వారా ఉద్యోగులకు జరిగే అన్యాయాన్ని ప్రశ్నించిన జగన్మోహన్ రెడ్డి నేడు అదేవిధంగా కొనసాగించడం దుర్మార్గమని ఆయన అన్నారు. ప్రభుత్వ హామీని నిలబెట్టుకుని సిపిఎస్ ని రద్దు చేసి తక్షణం ఓపిఎస్ ని అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో స్టీల్ సిఐటియు నాయకులు యు రామస్వామి, నీలకంఠం, శశి రెడ్డి, విడివి పూర్ణచంద్రరావు, గంగాధర్, ఒప్పంద కార్మిక ప్రతినిధులు పి శ్రీనివాసరాజు, వివి రమణ తదితరులతో పాటు వివిధ విభాగాల అధ్యక్ష కార్యదర్శులు కార్మికులు పాల్గొన్నారు.

# పారిశుధ్య నిర్వహణపై టోల్ ఫ్రీ నెంబర్ కు ఫిర్యాదు చేయండి

- ఫిర్యాదు అందిన వెంటనే 24 గంటలలో సమస్య పరిష్కారం
ప్రతి రోజూ పారిశుధ్యం పై వచ్చిన ఫిర్యాదులను
మేయర్ స్వయంగా పర్యవేక్షణ
- నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి



**విశాఖపట్నం,** (విజయభాను న్యూస్) : పారిశుధ్య నిర్వహణపై టోల్ ఫ్రీ నెంబర్ కు ఫిర్యాదులు చేయాలని నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి గురువారం ఒక ప్రకటన ద్వారా తెలిపారు. ఈ సందర్భంగా ఇప్పటికే టోల్ ఫ్రీ నెంబర్ "0891- 2869129" నగరంలో పారిశుధ్య నిర్వహణపై ఫిర్యాదులు చేయుటకు కేటాయించడం జరిగిందని, ప్రజలు స్పందించి ఈ నెంబర్ కు ఫిర్యాదులు చేస్తున్నారని తెలిపారు. ప్రత్యేకంగా పారిశుధ్య నిర్వహణపై మాత్రమే ఫిర్యాదులు చేయాలని, ఫిర్యాదు చేసిన 24 గంటలలో సమస్య పరిష్కారం అవుతుందని అలాగే ప్రతి రోజు పారిశుధ్యం పై వచ్చిన ఫిర్యాదులను స్వయంగా ఆమె పర్యవేక్షిస్తానని తెలిపారు. ఫిర్యాదు దారుడుతో నేరుగా ఆమె మాట్లాడి వారిచ్చిన ఫిర్యాదును పరిష్కారం అయ్యిందా లేదా అని స్వయంగా అడిగి తెలుసుకుంటానని తెలిపారు. నగర ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తమ తమ మొబైలలో ఈ ఫిర్యాదు నెంబర్ ను ఫీడ్ చేసుకోవాలని తెలిపారు.

జివిఎంసి పారిశుధ్య విభాగపు అధికారులు ఈ టోల్ ఫ్రీ నెంబర్ ద్వారా వచ్చిన ఫిర్యాదులను తక్షణమే స్పందించి, ఆయా సమస్యలను నిర్ణీత సమయానికే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. పారిశుధ్య నిర్వహణలో ఎటువంటి అలసత్వం ప్రదర్శించినా సంబంధించిన అధికారులపై చర్యలు తీసుకొనబడతాయని ఆమె ఒక ప్రకటన ద్వారా హెచ్చరించారు.

# ఖమ్మం సి.ఎం.ఆర్.షాపింగ్ మాల్ వారు 116 కిలోల లడ్డూ ప్రసాదం బహుకరణ





విశాఖపట్నం (విజయభాను న్యూస్) :

ఖమ్మం , బ్రాహ్మణ వీధిలో ఏర్పాటు చేసిన శ్రీ శివాలయం సెంటర్ మట్టిగణపతి ఉత్సవ కమిటీవారు ఏర్పాటు చేసిన 27 అడుగుల కాలసర్ప గణపతికి, వైరా రోడ్ ఖమ్మంలో నూతనంగా ప్రారంభం కానున్న సి.ఎం.ఆర్. షాపింగ్ మాల్ వారు తాపేశ్వరం సురుచి ఫుడ్స్ వారిచే ప్రత్యేకంగా తయారు చేయించిన 116 కిలోల లడ్డూ ప్రసాదంను ఖమ్మంలో మొట్టమొదటిసారిగా అందించారు మరియు గణపతి మండపానికి కావాల్సిన ప్రచార సామాగ్రిని కూడా అందించారు. ఈ లడ్డూ ప్రసాదమును ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ శ్రీమతి పునుకొల్లు నీరజ గారు జెండా ఊపి ఊరేగింపును ప్రారంభించి అనంతరం ఉత్సవ కమిటీకి అందించారు.

ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు సాయికిరణ్, రాకేష్, శివ, సైదారావు, పృథ్వీ, గోపి మరియు సి.ఎం.ఆర్. పబ్లిసిటీ సిబ్బంది పాల్గొన్నారు.

మొదటి పేజీ తరువాయి

# దేశంలోనే మొట్టమొదటి 'వర్చువల్ పాఠశాల' ప్రారంభం..

కారణాలతో బడికి వెళ్లలేని పిల్లలకు ఎంతో ఉపయోగపడుతుంది. దేశ విద్యారంగంలోనే దిల్లీ మోడల్ వర్చువల్ స్కూల్ ఓ మైలురాయి' అని కేజ్రీవాల్ చెప్పుకొచ్చారు.

ఈ దిల్లీ మోడల్ వర్చువల్ స్కూల్‌లో విద్యార్థులు లైవ్ క్లాస్‌లకు హాజరుకావచ్చు. రికార్డ్ చేసిన తరగతి సెషన్‌లు, స్టడీ మెటీరియల్‌ని కూడా యాక్సెస్ చేసుకోవచ్చు. ఆయా సదుపాయాలను విద్యార్థులకు అందుబాటులో ఉంచేందుకు ఒక్కో విద్యార్థికి ఒక్కో ఐడీ, పాస్‌వర్డ్ ఇవ్వనున్నారు. డిజిటల్ లైబ్రరీ సేవలు కూడా అందుబాటులో ఉంచారు. పార్ట్‌టైమ్ ఉద్యోగాలు చేయాలనుకునే విద్యార్థులకు నైపుణ్య ఆధారిత విద్యను కూడా అందించనున్నట్లు కేజ్రీవాల్ తెలిపారు. కరోనా సమయంలో నిర్వహించిన వర్చువల్ తరగతుల స్ఫూర్తితోనే ఈ పాఠశాలను ప్రారంభించినట్లు దిల్లీ సీఎం వెల్లడించారు.

# జివిఎంసి మేయర్, కమిషనర్ ను కలసిన జలంధర్ జర్నలిస్టులు

ద్వారా శుద్ధి చేసి వివిధ పరిశ్రమలకు, మొక్కలకు వినియోగించడం జరుగుతుందని, అలాగే పర్యావరణ దినోత్సవం పురస్కరించుకొని జూన్ 5వ తేదీ నుండి నగరంలో సింగల్ యూజ్ ప్లాస్టిక్ ను నిషేధించడమైనదని, ఈ కార్యక్రమానికి వెల్ఫేర్ అసోసియేషన్, స్వచ్ఛంద సంస్థలు, విద్యా సంస్థలు, సోషల్ మీడియా, ప్రింట్ ఎలక్ట్రానిక్ మీడియా ద్వారా అనేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందని, ఐదు వేల మంది విద్యార్థులు స్వయంగా తయారు చేసిన క్లాత్ బ్యాగ్ లను ఉద్దేశించి దేశ ప్రధాని మోడీ "మన్ కీ బాత్" కార్యక్రమంలో విశాఖ నగరానికి ప్రశంసలందించారని తెలిపారు. 22 వేల మంది వాలంటీర్లతో ఆగస్టు 26వ తేదీన అతి పెద్ద విశాఖ సాగరతీర పరిశుభ్రత కార్యక్రమం చేపట్టడం జరిగిందని, తద్వారా అనేక రికార్డులు, ఘనతలను జివిఎంసి సాధించారని, రాష్ట్ర ముఖ్యమంత్రి వై ఎస్ జగన్మోహన్ రెడ్డి స్వయంగా నగరానికి వచ్చి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారని దీన్ని స్ఫూర్తిగా తీసుకొని రాష్ట్రం మొత్తం ప్లాస్టిక్ బ్యానర్ ల నిషేధాన్నిముఖ్యమంత్రి ప్రకటించారని తెలిపారు.

ప్లాస్టిక్ ప్రత్యామ్నాయ మార్గంగా వస్త్ర, నార, కాగితపు వస్తువులతో తయారు చేసిన బ్యాగులను, ప్లేట్లను ఎకో బజార్ ద్వారా మూడురోజులలో అవగాహన కార్యక్రమం నిర్వహించామని, నగరంలో ఉన్న మాల్సులలో, బజార్లలో, రైతు బజార్లు తదితర ప్రాంతాలలో పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు కల్పించమని, ప్రజా ప్రతినిధులు లను కలుపుకొని సచివాలయాల ద్వారా ప్రచార కార్యక్రమాలు

నిర్వహించామని తెలిపారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ ను ఉపయోగించకుండా మట్టితో తయారు చేసిన గణపతి ప్రతిమలను నగర ప్రజలు ఉపయోగించే విధంగా అవగాహన కల్పించామని, వినాయక ప్రతిమలు నిమజ్జనం కొరకు మొబైల్ గణేష్ నిమజ్జన నీటి తొట్టెలను పలు ప్రాంతాలలో ఏర్పాటు చేసి జల కాలుష్యం నివారించమని, అంతేకాకుండా పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి సోమవారం నగర మేయర్ ఆర్టీసీ బస్సులోను, కమిషనర్ సైకిల్ పైన ప్రయాణిస్తున్నారని, సిబ్బంది ప్రజా రవాణా లను ఉపయోగించి తమ తమ విధులకు హాజరవుతున్నారని వివరించారు. స్వచ్ఛ సర్వేక్షన్ లో వివిధ స్థాయిలో ర్యాంకులు సాధించామని వారికి వివరించారు.

# యూపీఎస్సీ నిర్వహించబోతున్న పోటీ పరీక్షలకు పకడ్బందీగా ఏర్పాట్లు

ఆదేశించారు. అభ్యర్థులు హాల్ టికెట్ తో పాటు ఏదైనా ప్రభుత్వ గుర్తింపు కార్డు తప్పనిసరిగా తీసుకురావాలని తెలిపారు. ప్రశ్నాపత్రాలు చేరవేత మొదలుకొని పరీక్ష పూర్తయ్యాక బండిల్స్ ను యూపీఎస్సీ కి చేరవేసే వరకు నిబంధనలను అనుసరించి పనిచేయాలని లైజనింగ్ ఆఫీసర్లు, సూపరింటెండెంట్ లకు ఆయన సూచించారు. పరీక్ష కేంద్రాలకు మొబైల్ ఫోన్లు, క్యాలిక్యులేటర్, స్మార్ట్ వాచెస్, ఇతర స్మార్ట్ పరికరాలను తీసుకురాకూడదని ఆయన చెప్పారు. అభ్యర్థులను క్షుణ్ణంగా తనిఖీ చేసిన తర్వాతే పరీక్షా కేంద్రంలోనికి అనుమతించాలని చీఫ్ సూపరింటెండెంట్ లకు ఆదేశించారు. విద్యార్థులు వారి పరీక్ష సమయం కంటే అరగంట ముందుగా పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని అన్నారు. పరీక్ష నిర్వహించబడు రోజున విద్యుత్ సరఫరాకు ఎలాంటి అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని, పరీక్షా కేంద్రాల వద్ద వైద్య శిబిరం ఏర్పాటు చేయాలని , త్రాగు నీరు వంటి సదుపాయాలు అందుబాటులో ఉంచాలని సంబంధిత శాఖలకు ఆదేశించారు. ఇన్విజిలేటర్లకు కూడా పరీక్షా కేంద్రాల్లో సెల్ ఫోన్ అనుమతి వుండదని తెలిపారు. ఈ పరీక్షల నిర్వహణకు అధికార యంత్రాంగం సమన్వయంతో పనిచేయాలని ఆయన ఆదేశించారు . ఈ పరీక్షకు ఎలాంటి లోపాలు తలెత్తకుండా పారదర్శకంగా నిర్వహించడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో యూపీఎస్సీ అధికారులు, జీవిఎంసి, పోలీస్, మెడికల్, ఈపిడిసిఎల్ వివిధ కాలేజీల లైజనింగ్ ఆఫీసర్లు, రెవెన్యూ సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఎన్డీయేలో చేరికపై వారే జవాబు చెప్పాలి

నష్టపోయామన్నారు.

విభజన గాయాలు, ఆర్థికలోటులోనూ సంక్షేమ పథకాలు అమలు చేశామని గుర్తు చేశారు. వ్యవస్థలు నాశనమయ్యాక ఎవరూ ఏమీ చేయలేని పరిస్థితి వచ్చేసిందన్నారు. విభజన వల్ల జరిగిన నష్టం కంటే జగన్ వల్లే ఏపీకి ఎక్కువ నష్టం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. సంక్షేమ పథకాలకు శ్రీకారం చుట్టింది తెలుగుదేశం పార్టీయేనన్న చంద్రబాబు.. మళ్లీ అధికారంలోకి వస్తే రెట్టింపు సంక్షేమం అందిస్తామన్నారు. అవగాహన లేనివారే సంక్షేమం గురించి తమను విమర్శిస్తున్నారని చంద్రబాబు అన్నారు.

# భవిష్యత్ ఆవిష్కర్తలను తయారు చేయాలి

విశ్వవిద్యాలయాలు సమన్వయం చేస్తూ పనిచేయడం ఎంతో అవసరమన్నారు.నేడు ఆలోచనే విలువైన పెట్టుబడిగా నిలుస్తోందన్నారు. టెక్నికల్, నాన్ టెక్నికల్ విద్యార్థులు సైతం తమ ఆలోచలు పెట్టుబడిగా అభివృద్ధిని సాధించడం వీలవుతోందన్నారు. కార్యక్రమంలో డేవిడ్ జోయిల్, ఏసిఐఆర్ వ్యవస్థాపకుడు ఎరిక్ అజులే, యుఎస్ కాన్సులేట్ ప్రతినిధి జోయ్ క్రిష్టోఫర్, ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, ఏయూ ఇంక్యుబేషన్ సెంటర్ సిఈఓ రవి ఈశ్వరపు తదితరులు పాల్గొన్నారు.

# కేంద్రం ఇస్తామన్నా ఎందుకు తీసుకోవడం లేదో జగనే చెప్పాలి

సోము వీర్రాజు తప్పుబట్టారు. ఓటు బ్యాంకు రాజకీయాలకు ఇస్తున్న ప్రాధాన్యత రాష్ట్రాభివృద్ధికి ఎందుకు ఇవ్వడం లేదని నిలదీశారు. హర్డ్‌వేర్ పార్కు కాకినాడకు వచ్చి ఉంటే చాలా అభివృద్ధి జరిగి ఉండేదన్నారు. పెట్రో కెమికల్ కాంప్లెక్స్ తీసుకొస్తే లక్షలాది మందికి ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు మెరుగుపడేవని చెప్పారు. వైద్య కళాశాలలు ఇచ్చేందుకు కేంద్రం ముందుకొస్తే రాష్ట్ర ప్రభుత్వం అంతే వేగంగా స్పందించడం లేదని ఆయన అసహనం వ్యక్తం చేశారు.

# జీవీఎంసీ ఏర్పాటుచేసిన ప్రత్యేక నీటి తొట్టెలో

## వినాయక ప్రతిమను నిమజ్జనం చేసిన నగర మేయర్ దంపతులు



విశాఖపట్నం (విజయభాను న్యూస్) : పర్యావరణ పరిరక్షణలో భాగంగా జల కాలుష్యాన్ని తగ్గించేందుకు జివిఎంసి యంత్రాంగం చేస్తున్న ఈ ప్రయత్నంలో భాగంగా ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన నీటి తొట్టెలో తమ ఇంటిలోని పూజలందుకున్న వినాయక ప్రతిమను నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి 12వ వార్డు పరిధిలోని పెద్ద గదిలి శివాలయం వీధిలో నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా నగర మేయర్ మాట్లాడుతూ విఘ్నములకు అధిపతి వినాయకుని పూజించిన తర్వాతే ప్రతి పనిలో నిమగ్నం అవ్వాలని, ఆ స్వామిని పూజించిన తర్వాత ఏ పని తలపెట్టినను ఎటువంటి విఘ్నములు లేకుండా ఆ పనులు పూర్తవుతాయని అందుకు తొలి పూజ ఆయనకు చేస్తామని తెలిపారు. పార్వతీ పరమేశ్వరుల ముద్దుల తనయుడు సిద్ధి, బుద్ధి లోనూ ఉత్తముడు అయిన విఘ్నేశ్వరుని సేవించిన ఎడల మనకున్న అడ్డంకులన్నీ తొలగిపోతాయని ఆమె తెలిపారు. నగరాభివృద్ధిలోనూ ఆ స్వామి ఆశీస్సులతో మొదలు పెట్టే ప్రతి పని ఇప్పటి వరకు పూర్తి అవుతున్నాయని, ఆ స్వామి చల్లని చూపులు నగర ప్రజలపై ఉండాలని కోరుకున్నట్లు మేయర్ తెలిపారు.

# నేడు పూడిమడకలో జనసేన పార్టీ అధినేత

## పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు



అచ్యుతాపురం (విజయభాను న్యూస్) : నేడు పూడిమడకలో జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు జనసేన పార్టీ నాయకులు గురువారం ఒ ప్రకటనలో తెలిపారు . యలమంచిలి నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ , రాష్ట్ర అధికార ప్రతినిధి సుందరపు విజయ్ కుమార్ ఆధ్వర్యంలో అత్యంత జన సమూహం మధ్య కేక్ కటింగ్ చేసి వయోవృద్ధులు , వితంతువులు , దివ్యాంగులకు చీరలు , దుప్పట్లును పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు . ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ జిల్లా మత్స్యకార నాయకులు చోడిపల్లి అప్పారావు , జనసేన పార్టీ వర్కింగ్ కమిటి అధ్యక్షులు మేరుగు ప్రవీణ్ కుమార్ , గ్రామ పార్టీ అధ్యక్షులు కారి నూకరాజు , నాయకులు మేరుగు శ్రీను , దోని చంటి , బిబిన్ తదితరులు ఉన్నారు .

# రేషన్ బియ్యం అక్రమ రవాణా రీసైక్లింగ్ పై టీడీపీ ఆధ్వర్యంలో నిరసన



భీమునిపట్నం, (విజయభాను న్యూస్) : విజయభాను న్యూస్ పేదలకు పంపిణీ చేయవలసిన రేషన్ బియ్యం ను వైసీపీ నాయకులు ఇతర దేశాలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారనీ టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు పిలుపు మేరకు, భీమిలి నియోజకవర్గ ఇన్చార్జ్ కోరాడ రాజబాబు ఆధ్వర్యంలో గురువారం స్దానిక తహశీల్దారు కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం, నిర్వహించారు.

అనంతరం తహశీల్దారుకె.వేణుగోపాల్ కు వినతిపత్రం అందజేశారు. ముందుగా స్థానిక గంటస్థంబం వద్ద. పేదలకు ఇవ్వవలసిన ఉచిత బియ్యం ఇవ్వాలని నినాదాలు చేసారు. ఈ సందర్భంగా రాజబాబు మాట్లాడుతూ నిరుపేదలకు చెందవలసిన రేషన్ బియ్యం వైకాపా నాయకులు పక్క తోవ పట్టిస్తున్నారనీ దాంతో పేదలకు చెందవలసిన బియ్యం వారికి అందకపోవడంతో వాళ్ళు చాలా ఇబ్బందులు పడుతున్నారనీ చెప్పారు.

రాష్ట్రంలోని పేదలకు పంపిణీ చేయాల్సిన రేషన్ బియ్యాన్ని వైసీపీ నాయకులు అక్రమంగా ఇతర దేశాలకు తరలించి సొమ్ము చేసుకోవడం, రేషన్ బియ్యంను రీసైకిలింగ్ చేసి మరలా అమ్ముకోవడం ద్వారా వేల కోట్ల కుంభకోణం చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు, భీమిలి మండల పార్టీ ప్రెసిడెంట్ విశాఖ పార్లమెంట్ రైతు ప్రధాన కార్యదర్శి డి ఏ ఎన్ రాజు , రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు కురిమిన లీలావతి, గోడి అరుణ, మాజీ జెడ్పిటిసిలు కశిరెడ్డి దామోదరం, శరగడ అప్పారావు, విశాఖ పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి పిట్ట సురేష్ , వానపల్లి సత్య మాజీ కౌన్సిలర్ చిలకా నర్సింగరావు, 1,2,4,8వార్డుల పార్టీ అధ్యక్షులు తమ్మిన సూరిబాబు, బడికంఠం నీలకంఠం, పాసి నర్సింగరావు, చెట్టుపల్లి గోపి, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు బోయి రమాదేవి, సీనియర్ నాయకులు గొలగాని సన్యాసిరావు, నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షులు పతివాడ రాంబాబు , నియోజకవర్గ యువత జనరల్ సెక్రెటరీ దంతులూరి సిద్ధార్థ వర్మ కారి అప్పారావు, గరికిని ఎల్లయ్య( కింగ్) పెంటపల్లి యోగీశ్వరావు, మారోజు సంజీవకుమార్, కనకల అప్పలనాయుడు, కాసరపు ఎల్లాజీ, వాడమొదలు సత్యారావు, కొక్కిరి అప్పన్న, వియ్యపు పోతురాజు, తదితరులు పాల్గొన్నారు.

# డిగ్రీ విద్యార్థులు ఇంటర్న్ షిప్ లపై దృష్టి పెట్టాలి




ములగాడ (విజయభాను న్యూస్ ): డిగ్రీ విద్యార్థులు ప్రాజెక్టులకు, ఇంటర్న్ షిప్ లకు అత్యధిక ప్రాధాన్యత నివ్వాలని ప్రముఖ విద్యావేత్త, అధ్యాపకులు డాక్టర్ గూడిపాటి శ్రీనివాసరావు అన్నారు. స్థానిక సెయింట్ ఆన్స్ డిగ్రీ కళాశాలలో ఇంటర్న్ షిప్ పై నిర్వహించిన ప్రాంతీయ సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా ప్రసంగిస్తూ- సమాజంలోని వివిధ వర్గాల సమస్యల అధ్యయనంలో, పరిశ్రమలను కళాశాలలతో అనుసంధానం చేయడంలో, నిరుద్యోగ సమస్యను పరిష్కరించడంలో, విద్యను నవ సమాజ నిర్మాణానికి వారధిగా చేయడంలో ఇంటర్న్ షిప్ లు ఎంతగానో ఉపయోగపడతాయని అన్నారు.

ప్రథమ, ద్వితీయ, తృతీయ సంవత్సర డిగ్రీ విద్యార్థులు ఇంటర్న్ షిప్ లు ఎలా చేయాలో సవివరంగా తెలియజేశారు. సదస్సుకు సెయింట్ ఆన్స్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ ప్రేమకుమారి అధ్యక్షత వహించగా, సదస్సులో జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సిస్టర్ జానీస్ , సెయింట్ ఆన్స్, షిప్ యార్డ్, చైతన్య, డిఫెన్స్ తదితర కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం శ్రీనివాసరావును ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జాతీయ సేవా పథకం జిల్లా ప్రోగ్రాం అధికారి ఇ.పి.ఎస్. భాగ్యలక్ష్మి, సెమినార్ నిర్వాహక కమిటీ సభ్యులు దివ్య జ్యోతి, అంజలీదేవి, రోజా, శాంతి మరియు పెద్ద సంఖ్యలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మధురవాడ (విజయభాను న్యూస్) : మహా విశాఖ పీఎంపాలెం సబ్ స్టేషన్ పరిధిలో గల 33/11 కే.వి లో 11కే.వి పెప్సీ ఫీడర్ మరమ్మత్తు పనులు మరియు ఫీడర్ కు సంబంధించిన చెట్టు కొమ్మలు తొలగింపు, లైన్ మెయింటెనెన్స్ కారణంగా ఈ రోజు ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 3 గంటల వరకు మొగధారమ్మ ఫీడర్ లో ఆర్టీసీ డిపో ఏరియా, మొగధారమ్మ టెంపుల్ ఏరియా, సైబర్ వాలీ లేఅవుట్, ఓల్డ్ మధురవాడ మెట్ట, ఖుషి షాపింగ్ మాల్ ఏరియా తదితర ప్రాంతాలల్లో జోన్ 3 ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పోలాకి శ్రీనివాసురావు ఆదేశాలు మేరకు విధ్యుత్ సరపరా నిలిపి చేయనున్నట్లు వినియోగదారులు సహకరించ వలసినిదిగ అదనపు ఇంజనీర్ డి.నరేష్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు.

# పోషకాహారంతోనే మంచి ఆరోగ్యం

**- సెప్టెంబర్ 1 నుండి 7 వరకు జాతీయ పోషకాహార వారోత్సవాలు**

**- కిమ్స్ ఐకాన్ కన్సల్టెంట్ డైటిషియన్ లావణ్య**



విశాఖపట్నం (విజయభాను న్యూస్): రాబోయే తరాలు ఆరోగ్యంగా జీవించాలంటే పోషకాహారం తప్పనిసరి. ఈ విషయం అందరికీ తెలియ జేయడానికి ప్రతి ఏటా సెప్టెంబర్ 1 నుంచి 7వ తేదీ వరకు వారం రోజులు పాటు జాతీయ పోషక ఆహార వారోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. సమాజాన్ని చైతన్యవంతం చేయడానికి పలు కార్యక్రమాలు చేపడతారు. విశాఖపట్నం ఇప్పుడు మెట్రో నగరంగా అడుగులు వేస్తోంది. కాబట్టి జనభాకు సరిపడా ఆహారం సమర్చుకోవాలి. ప్రధానంగా చిన్న పిల్లల నుండి వృద్దుల వరకు వివిధ రకాల ఆహారాలు తీసుకోవడం వల్ల భవిష్యత్తులో మంచి ఆరోగ్యంగా ఉంటారు.

**పౌష్టికాహరం అందించాలి ఇలా..**

పిల్లలకు 7 నెలల నుంచి జావలు, కూరగాయాలు, పండ్ల గుజ్జుగా చేసిన ఆహార పదార్థాలను రోజుకు రెండుసార్లు శిశువుకు 250 మిల్లీ లీటర్ల చొప్పున అందజేయాలి. 11 నెలల లోపు చిన్నారులకు ఆహారం గుజ్జుగా చేసి రోజుకు మూడు దఫాలుగా 250 మిల్లీలీటర్ల చొప్పున అందించాలి. శరీరం పెరుగుదలకు, గుండె పని, శరీర ఉష్ణోగ్రత మొదలైనవాటికి తగినట్లు ఆహారం అందిస్తూ ఉండాలి. విటమిన్ ఎ లోపం వలన రేచీకటి, కార్నియల్ క్యూరోసిస్ వ్యాధుల నివారణకు పాలు, పాలపదార్థాలు, ఆకు కూరలు, పసుపు పచ్చ కూరగాయలు, క్యారెట్, గుమ్మడి తీసుకోవాలి. ఇనుము లోపం వలన వచ్చే అనేమియా వ్యాధి నివారణకు ఎర్రటి మాంసం, గుడ్లలోని పసుపు, ధాన్యాలు, ఆకుకూరలు, శనగలు, నువ్వులు, చిక్కుళ్లు, పప్పులు, బెల్లం, డ్రై ఫ్రూట్స్, మొలకెత్తిన పప్పు ధాన్యాలు తీసుకోవాలి. అయోడిన్ లోపంతో వచ్చే గ్రంథివాపు వ్యాధి నివారణకు అయోడిన్ ఉన్న ఉప్పును మాత్రమే ప్రతి రోజు తీసుకోవాలి. సముద్ర ఆహారం స్వీకరించాలనే ప్రచారం ఐసీడిఎస్ చేయనుంది.

**జాతీయ పోషకాహార వారోత్సవాల చరిత్ర**

పోషకాహారలోపం అనేది దేశాభివృద్ధికి ప్రధాన అడ్డంకి కాబట్టి పోషకాహార విద్య ద్వారా మంచి ఆరోగ్యం మరియు ఆరోగ్యకరమైన జీవితాన్ని ప్రోత్సహించడానికి 1982 సంవత్సరంలో కేంద్ర ప్రభుత్వం మొదటిసారిగా ఈ ప్రచారాన్ని ప్రారంభించింది. ఈ లక్ష్యం దిశగా ప్రజలను ప్రోత్సహించేందుకు, దేశవ్యాప్తంగా 43 ఫుడ్ అండ్ న్యూట్రిషన్ బోర్డ్ (మహిళలు మరియు శిశు విభాగం, ఆరోగ్యం మరియు ఎన్జీఓ) యూనిట్లు సమర్థవంతంగా పనిచేస్తున్నాయి.

**పోషకాహార సమస్యకు ప్రధాన కారణాలు...**

మన ఆరోగ్యానికి, పోషకాహారానికి మధ్య అవినాభావ సంబంధం ఉంది. పౌష్టికాహార లోపం తక్కువ బరువు, ఉబయకాయం, బుద్ధిమాంద్యం, రక్తహీనత, గర్భస్రావం, శిశు మరణాలు లాంటి సమస్యలకు దారి తీస్తుంది. అంతేకాకుండా ఇది రక్తపోటు, మధుమేహం, మూత్రపిండ వ్యాధులు లాంటి దీర్ఘకాలిక వ్యాధుల ముప్పుకు దారితీస్తుంది.

రోజు రోజుకు మనిషి జీవనం యాంత్రికంగా మారిపోవడంతో ఆహార వినియోగంలో రీతిలో పలు మార్పులు చోటు చేసుకున్నాయి. ముఖ్యంగా సులభ లభ్యత, సమయం ఆదా అవడం మూలంగా అధిక కేలరీలు, సాధారణ పిండి పదార్థాలు, సంతృప్త కొవ్వులు, చక్కెర, అధిక సోడియం కలిగిన భోజనం వైపు ఎక్కువ మొగ్గు చూపడం జరుగుతుంది. ఇంటి వంటకాల బదులు సాధారణ పిండి పదార్థాలు లేదా సులభంగా లభ్యమయ్యే జంక్ ఫుడ్(చిరుతిళ్ళు), ప్రాసెస్ చేసిన ఆహారాల వైపు మొగ్గు చూపడంతో భారతీయ ఆహారంలో ప్రోటీన్‌ల కంటే కార్బొహైడ్రేట్లు అధికంగా ఉన్నాయని నివేదికలు వెల్లడిస్తున్నాయి. ఫలితంగా పిల్లలు అధిక బరువు, స్థూలకాయం లాంటి సమస్యలను ఎదుర్కోవడం జరుగుతుంది. మరోవైపు రోగనిరోధక శక్తి లోపించి పలు అంటు వ్యాధులతో మరణిస్తున్నారు. పర్యావరణ కాలుష్యం, ఆహార పదార్థాల కల్తీ, సమతుల ఆహారంపై అవగాహన లోపం, సరైన పారిశుధ్ధ్య వ్యవస్థ కొరవడటం కూడా పోషకాహారాన్ని దెబ్బతీస్తున్నాయి.

**భారతదేశంలో పోషకాహారలోపాన్ని పరిశీలిస్తే**

భారతదేశంలో తీరు తెన్నులు పరిశీలిస్తే... ఐదు సంవత్సరాల కంటే తక్కువ వయసున్న పిల్లల మరణాల్లో 69శాతం పోషకాహార లోపం ఉందని నివేదికల ద్వారా తెలుస్తున్నాయి. 2025 నాటికి ప్రపంచ పోషకాహార లక్ష్యాలను కోల్పోయే 88 దేశాలలో భారతదేశం ఉందని తెలుస్తోంది.

**పోషకాహార లోపాన్ని అధిగమించడానికి చర్యలు**

పోషకాహార లోపం అనేది ఒక ప్రజారోగ్య సమస్య. ఆరోగ్యంగా ఉండాలంటే పోషకాలున్న ఆహారం తప్పనిసరి. బహుముఖ కోణంలో కొనసాగుతున్న పోషకాహార లోపాన్ని సవరించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విధానపరమైన, చట్టపరమైన చర్యలకు శ్రీకారం చుట్టవలసిన అవసరం ఉంది. సమతుల్య ఆహారం కొరకు క్యాలరీలు, మాంసకత్తులతో పాటు సూక్ష్మ పోషకాలైన ఐరన్, విటమిన్ ఎ, డి, జింకు వంటి అనుబంధ ఆహారాన్ని అందించాలి. అప్పుడే గర్భిణీ స్త్రీలు, బాలింతలు, చిన్నపిల్లలను పోషకాహార లోపానికి గురయ్యే ప్రమాదం నుంచి కాపాడవచ్చు.

పిల్లలకు వ్యాధి నిరోధకశక్తిని కలిగించటంతో పాటు దైనందిన జీవితంలో సక్రమమైన పారిశుధ్ధ్య వ్యవస్థను రూపొందించాలి. మనం తీసుకునే మొత్తం ఆహారంలో మాంసకృత్తుల విలువను పెంచేందుకుగాను సరియైన పరిమాణాల్లో పాలు, గుడ్లు, మాంసం, చిరు ధాన్యాలు ఆహారంలో భాగం కావాలి. ఆరోగ్యానికి అవసరమైన సమతుల ఆహారాన్ని తీసుకోవడంపై ప్రజల్లో అవగాహన కలిగించాలి. పోషకాహార లోపంతో బాధపడుతున్న వారు జామ, అరటి, బొప్పాయి, బత్తాయి, దానిమ్మ, యాపిల్ వంటి పండ్లు, కూరగాయలను తీసుకుంటే పోషకాలు లభించేందుకు అవకాశం ఉంటుంది. అధిక ప్రోటీన్లు లభించే ఆహార పదార్థాలపై పరిశోధన జరగాలి, వాటి ఉత్పత్తిని ప్రోత్సహించాలి. పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులకు చిరుతిళ్ళు అలవాటును తగ్గించాలి.

ప్రజల కొనుగోలు శక్తిని పెంచే విధంగా ఉపాధి అవకాశాలను కల్పించాలి. రసాయన మందులు వాడి పండించిన ఆహారపదార్థాల ద్వారా ఊబకాయం వస్తుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ నేపథ్యంలో మన వ్యవసాయ విధానాలతో పాటు ఆహార వినియోగంలో విప్లవాత్మకమైన మార్పు తీసుకురావాలి.

ముఖ్యంగా సేంద్రియ వ్యవసాయ విధానాన్ని ప్రోత్సహించి, ఆహార పదార్థాలను ఉత్పత్తి చేయాలి. ప్రతి వంటిల్లు పోషకాహారశాలగా తయారు కావాలి. అందుకు ఆరోగ్యం అందించే ఆహార పట్టికను తయారు చేయాలి.

నేడు సంపూర్ణ ఆరోగ్యానికి స్వచ్ఛ ఆహార ఆవశ్యకత పెరుగుతున్న తరుణంలో పోషకాలనిచ్చే ఆహార పదార్థాలు ఉత్పత్తి అనివార్యం కావాలి.

# ఫ్లెక్సీ పై నిషేధం తగునా

## టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు



భీమునిపట్నం: విజయభాను న్యూస్ ప్లాస్టిక్ పై నిషేధం విధించి పర్యావరనాన్ని కాపాడవలసిన అవసరం ఉందని కానీ ఫ్లెక్సీ పై నిషేధం సరైన నిర్ణయం కాదని టి డి పి రాష్ట్ర కార్యదర్శి, గంటా నూకరాజు అన్నారు.

రాష్ట్ర వ్యాప్తంగా ఈ ఫ్లెక్సీ లపై ఆధారపడి 5 లక్షలకు పైగా జీవనం సాగిస్తున్నారని, లక్షలకు లక్షలు పెట్టుబడులు పెట్టి ప్రింటింగ్ మిషన్లు, ఫ్లెక్సీ షీట్స్ కొనుగోలు చేసి ఉన్నారని అన్నారు. ఇంత అకస్మాత్తు గా ఫ్లెక్సీ లపై నిషేధం అంటూ ముఖ్యమంత్రి ఎందుకు ప్రకటన చేయవలసి వచ్చిందో అర్ధం కాలేదని గంటా నూకరాజు అన్నారు. రీ సైక్లింగ్ కానీ ప్లాస్టిక్ వ్యర్థాలు పర్యావరనానికి హానికరమని అలాంటివి నిషేదించాలి కానీ ఫ్లెక్సీ లపై నిషేధం ఏంటని గంటా నూకరాజు ప్రశ్నించారు. ఫ్లెక్సీ ప్రింటింగ్ మీద ఆధారపడి బ్యాంకు లో లక్షల రూపాయలు అప్పులుచేసి పెట్టుబడి పెట్టి జీవనం సాగిస్తున్న వీరిపై ఎందుకు ఇంత కక్ష సాధింపని నిలదీశారు. ప్లాస్టిక్ ముసుగులో ఫ్లెక్సీ లపై నిషేధం నిర్ణయం వెనక్కి తీసుకోవాలని గంటా నూకరాజు డిమాండ్ చేసారు.

# 58వ వార్డులో వైభవంగా గణపతి మహోత్సవం



ములగాడ (విజయభాను న్యూస్ ): జీవీఎంసీ 58వ వార్డ్ లో రజక సేవా సంఘం ఆధ్వర్యంలో వినాయక చవితి సందర్బంగా గణపతి మహొత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. ఈ సందర్బంగా గణపతి స్వామికి నిర్వహించిన ప్రత్యేక పూజాకార్యక్రమంలో జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంగ దుర్గా ప్రశాంతి ముఖ్య అతిథి గా పాల్గొని స్వామివారిని దర్శించారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు సి హెచ్ రామారావు , సి హెచ్ గజ్జిలమ్మ , సి హెచ్ శ్రీను , శంకర రావు , పి శ్రీను , సి హెచ్ పెంటారావు , సి హెచ్ కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

# విజయభాను సంపాదకీయం

## ప్రాంతీయ భాషలకు అన్యాయం

అఖిల భారత స్థాయి అధికారులుగా ప్రజాసేవ చేయడానికి మార్గం సివిల్ సర్వీస్ పరీక్షలు. వాటిలో విజయం సాధించి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఎంతోమంది అభ్యర్థులు కలలు కంటుంటారు. అందుకోసం అహో రాత్రాలు శ్రమిస్తారు. జూన్ అయిదున యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) సివిల్ సర్వీస్ ప్రాథమిక పరీక్ష (ప్రిలిమ్స్)ను నిర్వహించనుంది. మొదటి నుంచీ ప్రాథమిక పరీక్షను కేవలం ఆంగ్లం, హిందీ భాషల్లోనే జరుపు తుండటంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. దక్షిణాదితో పాటు పలు ఉత్తరాది, ఈశాన్య రాష్ట్రాల అభ్యర్థులు సివిల్స్ ప్రిలిమ్స్‌ను ప్రాంతీయ భాషల్లో నిర్వహించాలని కోరుతున్నా కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. ఫలితంగా ప్రాంతీయ భాషల్లో చదువుకొని హిందీ, ఆంగ్లంపై సరైన పట్టులేని అభ్యర్థులు నష్టపోతున్నారు. భారత రాజ్యాంగంలోని ఎనిమిదో షెడ్యూల్లో 22 భాషలను అధికారికంగా గుర్తిం చారు. అఖిల భారత స్థాయి అధికారుల ఎంపికలో తొలి మెట్టు అయిన సివిల్స్ ప్రిలిమ్స్‌ను కేవలం ఆంగ్లం, హిందీ లలోనే నిర్వహించడం ప్రాంతీయ భాషలపట్ల దుర్విచక్షణే! ఉద్యోగ, ఉపాధి విషయాల్లో ఎలాంటి దుర్విచక్షణా ఉండకూడదని రాజ్యాంగంలోని 16వ అధికరణ చెబుతోంది. సివిల్స్ ప్రిలిమ్స్ విషయంలో యూపీఎస్సీ, కేంద్రం తీరు- ఆ స్ఫూర్తికి విరుద్ధంగా ఉంది. వేల సంవత్సరాల చరిత్ర కలిగి, ప్రాచీన హోదా పొందిన తెలుగు, కన్నడం, తమిళం, మలయాళం, ఒడియా వంటి భాషల్లోనూ సివిల్స్ ప్రాథమిక పరీక్షను నిర్వహించకపోవడం సరైనదికాదు. పేద పిల్లలు ఎక్కువగా ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లోనే చదువుతారు. ఇటీవలి కాలంలో సర్కారు బడుల్లోనూ ఆంగ్లంలో విద్యాబోధన ప్రారంభమైంది. నిన్నమొన్నటిదాకా దాదాపు అన్ని పాఠశాలల్లో ప్రాంతీయ భాషల్లోనే బోధన సాగింది. గ్రామీణ ప్రాంతాల్లో ఆంగ్లంపై సరైన పట్టు ఉన్నవారు చాలా తక్కువగానే కనిపిస్తారు. ఈ నేపథ్యంలో సివిల్స్ ప్రాథమిక పరీక్షను కేవలం ఆంగ్లం, హిందీలలోనే నిర్వహించడం- అలాంటి వారి పట్ల అన్యాయమే.

సివిల్స్ ప్రధాన పరీక్ష (మెయిన్స్) రాయడానికి రాజ్యాంగం గుర్తించిన భాషల్లో ఏదో ఒకటి ఎంచుకోవడానికి అవకాశం ఉంది. అలాంటప్పుడు ప్రాథమిక పరీక్షను ప్రాంతీయ భాషల్లో ఎందుకు నిర్వహించకూడదన్న సందేహం తలెత్తుతుంది. మరోవైపు మెయిన్స్ పరీక్షలను ప్రాంతీయ భాషల్లో రాసే అవకాశం ఉన్నా, సరైన పాఠ్య సామగ్రి అందుబాటులో లేదు. అందువల్ల అతి తక్కువ మంది మాత్రమే ప్రాంతీయ భాషల్లో మెయిన్స్‌కు హాజరవుతున్నారు. యూపీఎస్సీ లెక్కల ప్రకారం 2020లో తెలుగులో మెయిన్స్ వ్యాసం, జనరల్ స్టడీస్ పరీక్ష లను రాసినవారు నలుగురు మాత్రమే. తమిళం అభ్యర్థులు 25 మంది కనిపిస్తారు. గుజరాతీ, మరాఠీలో 40 మందికి పైగా ప్రాంతీయ భాషను ఎంచుకున్నారు.

ప్రిలిమ్స్ ప్రాథమిక పరీక్షను ప్రాంతీయ భాషల్లో నిర్వహించేలా చూడాలని అభ్యర్థులు యూపీఎస్సీ, కేంద్ర ప్రభుత్వాలను కోరుతున్నా సరైన స్పందన ఉండటంలేదు. ఈ విషయంలో తమిళనాడు ప్రజాప్రతినిధుల చొరవ మెచ్చు కోదగినది. సివిల్స్ అభ్యర్థుల కోసం పలుమార్లు అసెంబ్లీ, పార్లమెంటులో వారు గళం వినిపించారు. తెలుగు రాష్ట్రాలతో పాటు ఇతర ప్రాంతాల్లోని ప్రభుత్వాలు, ప్రజా ప్రతినిధులు సైతం ఈ విషయంలో స్పందించాలి. ప్రసార మాధ్యమాల్లోనూ దానిపై విస్తృతంగా చర్చ జరగాల్సిన అవసరం ఉంది. ఆయా రాష్ట్రాల నుంచి అఖిల భారత స్థాయి అధికారులుగా అనేక మంది ప్రతిభావంతులు ఎదగడానికి ఆస్కారం ఉంది. అలాంటి వారికి సివిల్స్ పరీక్షలకు అవసరమైన నైపుణ్యాలను అందించడానికి ప్రభుత్వాలు చొరవ తీసుకోవాలి. వారికోసం అవసరమైన శిక్షణా సంస్థలను గ్రామీణ ప్రాంతాల్లో ఏర్పాటు చేయడంపై దృష్టి సారించాలి. ప్రాంతీయ భాషల్లో నాణ్యమైన పాఠ్య సామగ్రిని అందు బాటులోకి తేవడమూ అత్యంత కీలకం. కేవలం యూపీఎస్సీనే కాకుండా స్టాఫ్ సెలక్షన్ కమిషన్ (ఎస్ఎస్‌సీ) తదితర పరీక్షలనూ ప్రాంతీయ భాషల్లో నిర్వహించాలి. ఉపాధి, ఉద్యోగం పొందడంలో ప్రాంతీయ భాష ఎన్నటికీ అవరోధం కాకూడదని రాజ్యాంగం చెబుతోంది. ఆ అంశాన్ని గుర్తించి స్థానిక భాషల్లో పోటీ పరీక్షలను నిర్వహించి రాజ్యాంగ స్ఫూర్తిని కాపాడాల్సిన అవసరం ఉంది.



వేల్పులలో సచివాలయ కాంప్లెక్స్‌ను ప్రారంభించిన సీఎం వైఎస్ జగన్ అనంతరం సచివాలయ కాంప్లెక్స్ సముదాయాన్ని సీఎం వైఎస్ జగన్ పరిశీలించారు. వేల్పులో ఒకే ప్రాంగణంలో అన్ని ప్రభుత్వ సంక్షేమ భవనాలు. వేముల మండలంలోని వేల్పుల గ్రామ సచివాలయ కాంప్లెక్స్‌ను సీఎం వైఎస్ జగన్ ప్రారంభించనున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జిల్లాలో మూడు రోజులపాటు పర్యటించనున్నారు. ఈ క్రమంలో సీఎం జగన్ వైఎస్సార్ జిల్లా పర్యటనకు బయల్దేరారు. వైఎస్సార్ జిల్లాలో సెప్టెంబరు 1 నుంచి 3వ తేదీవరకు ముఖ్యమంత్రి వివిధ కార్యక్రమాల్లో పాల్గొననున్నారు.



## తెల్లరేషన్ కార్డు ఉన్నవారికి ఉచితంగా బియ్యం అందజేయాలి

### టిడిపి మండల అధ్యక్షులు వియ్యపు చిన్నా డిమాండ్



పరవాడ : రాష్ట్ర తెలుగుదేశం పార్టీ పిలుపు మేరకు జాతీయ ఆహార భద్రత చట్టాన్ని అనుసరించి రాష్ట్రం లోని ప్రతి తెల్ల రేషన్ కార్డు దారునికి ఉచిత బియ్యాన్ని అందచేయాలి అని పరవాడ మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు వియ్యపు చిన్నా డిమాండ్ చేశారు .జాతీయ ఆహార భద్రత చట్టం 2013 ప్రకారం పేదలకు ఆకలి తీర్చడం ప్రభుత్వాలు యొక్క విధి అయిథె గత కొంత కాలంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రము లో ఈ జగన్ రెడ్డి ప్రభుత్వం ఆహార భద్రతా చట్టానికి తూట్లు పొడుస్తున్నది అని అన్నారు.తెల్ల రేషన్ కార్డు కలిగిన ప్రతి పేద వాడికి బియ్యం పంపిని చేయ వలసి ఉన్నా చేయకుండా ఆహార భద్రత చట్టాన్ని దెబ్బతీస్తున్నారు అని అవేదన వ్యక్తం చేసారు .కేంద్ర ప్రభుత్వము చేపట్టిన పిఎమ్ జికెఎవై పథకం క్రింద సబ్సిడీ బియ్యం తో పాటుగా ఉచిత బియ్యాన్ని అందించాల్సినదిగా కేంద్ర ప్రభుత్వం ఆదేశాలను సైతం భేకతారు చేయిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం ఏప్రిల్ 2022 నుండి ఉచిత బియ్యం పంపిణి నిలిపివేశారు.

కేంద్ర ప్రభుత్వం హెచ్చరికల మేరకు గత నెల ఆగష్టు లో ఉచిత బియ్యం పంపిణి సిద్ధపడినప్పటికీ ఎన్ ఎఫ్ యస్ ఎకార్డు దారులకు మాత్రమే పంపిణి చేయడం జరిగింది అన్నారు .అందులోనూ చాలా చోట్ల కార్డు దారులు జాబితా మార్పులు చోటు చేసుకున్నాయి .అదే సమయము లో గత కొంత కాలముగా అక్రమ మార్గాల్లో విదేశాలకు ఎగుమతులు జరుగుతున్నాయి అన్నారు.జాతీయ ఆహార భద్రత చట్టాన్ని అనుసరించి రాష్ట్రము లో ప్రతి తెల్ల రేషన్ కార్డు దారునికి ఉచిత బియ్యాన్ని అందించాలి అని పరవాడ మండల తెలుగుదేసం పార్టీ అధ్యక్షులు వియ్యపు చిన్నా డిమాండ్ చేయడం జరిగింది . మండల తహసీల్దారి కి వినతి పత్రం ఇవ్వడం జరిగింది . ఈ కార్య క్రమం లో రాయవరపు దేముడు ( మాజీ సర్పంచ్ ),కూండ్రపు శ్రీ రామ్ (ఎంపిటిసి), మూర్తి ,బండారు ముసిలినాయుడు ,జాజులు చిన్నారావు, పైల బుజ్జి సన్యాసిరావు వియ్యపు సూర్యచంద్ర అప్పారావు ,గండి మహేష్ ,తెలుగుదేశం పార్టీ నాయుకులు ,కార్యకర్తలు పాలుగోన్నారు .

# కవి సమయం

## 'ప్రేమ'

సృష్టిలో తీయనిది ప్రేమోనోయ్
అనంతమైనది, అద్భుతమైనది ప్రేమ
ప్రపంచం అంతా ప్రేమమయం
సముద్రం నుండి అలలు
చంద్రుని నుండి వెన్నెల
సూర్యుని నుండి కిరణాలు
దైవం నుండి ప్రేమ దివ్యలీల
కర్కశ హృదయాన్ని మార్చే శక్తి
ప్రేమే సృష్టికి మూలం, జీవనాధారం
ప్రేమే ధర్మం, ప్రేమే భాష్యం
ప్రేమే కావ్యం, ప్రేమే సర్వశ్వం
ఎన్నటికీ మారనిది, త్యాగం కలిగి
ప్రతి ఫలాన్ని ఆశించనిది
నిత్యము, సత్యము, శాశ్వతము

...కవితా రచన
సి.ప్రతాప్

# పంచాంగం

మాసం : భాద్రపద; తిథి : చవితి రా.11.06; పునర్వసు సా.4.21; రా.వ.1.08ల 2.54.

శుక్రవారం 02-09-2022

a **మేషం** : దూర ప్రయాణాలు చేస్తారు. శరీర వత్తిడి, అలసటి ఎక్కువగా ఉంటుంది. స్త్రీలు షాపింగ్ వ్యవహారాలలో అపరిచిత వ్యక్తులపట్ల మెళుకువ అవ సరం. పత్రికా సంస్థలలోని వారికి పనిభారం, విశ్రాంతి లోపం వంటి చికాకులు అధికం. నిర్మాణ పనులలో జాప్యం, అధిక వ్యయం వల్ల ఆందోళనకు గురవు తారు. రావలసిన ధనం వాయిదాపడుట వల్ల ఆందోళనకు గురవుతారు.

b **వృషభం** : సమయానికి నిద్రా, భోజనం ఉండదు. దీర్ఘరోగులు మాత్రం జాగ్రత్త అవసరం. నిరుద్యోగులకు ఉపశమనం కలుగుతుంది.

c **మిథునం** : తఉద్యోగులకు పై అధికారుల వత్తిడి కలుగుతుంది. దూరపు బంధువులతో ఇష్టాగోష్టి చేస్తాడు. విందు, వినోద కార్యమ్రాల్లో పాల్గొంటారు.

d **కర్కాటకం** : నూతన వ్యాపారాలు చేయువారి వ్యవహారాలు అనుకూలించును. అవసరాలకు అనుకున్న సమయానికి ధనం చేతికి అందు తుంది. పాత సన్నిహితులను కలుసుకుంటారు. రాజకీయ నాయకులకు అనుకూలం. ఆరోగ్యం బాగుంటుంది.

e **సింహం** : ఆర్థిక విషయాల్లో ప్రోత్సాహకరంగా ఉంటుంది. రుణాలు మంజూరు అగును. బిందువుల కొరకు విలువైన వస్తువులను కొంటారు. సన్నిహితులతో కలిసి విందు, వినోద కార్యకలాపాలు సాగిస్తారు.

f **కన్య** : హోటల్, కేటరింగ్ రంగాల్లోవారు పని వారితో ఇబ్బందులు ఎదుర్కొంటారు. ఆలయ సందర్శనాలలో ఇబ్బందులను ఎదుర్కొంటారు. కోర్టు వాదోపవాదాల్లో ప్లీడర్లు విజయం సాధిస్తారు. మీ శ్రీమతి సహాయం లేనిదే మీ సమస్యలు పరిష్కారం కావని గ్రహించండి. ఇతరుల మెప్పుకోసం శ్రమాధిక్యత, ఒత్తిడి ఎదుర్కొనవలసివస్తుంది.

g **తుల** : ప్రయాణాల లోనూ, బ్యాంక్ వ్యవహారాలలోను ఇబ్బందులను ఎదుర్కొంటారు. పత్రికా, ప్రైవేటు రంగాల వారికి ఆర్థిక ప్రగతితో కూడిన అవకాశాలు లభిస్తాయి. రావాణా రంగాలలోని వారికి చికాకులుతప్పవు. బంధువుల రాకతో గృహంలో సందడి కాన వస్తుంది. పెట్టుబడుల విషయంలో పునరాలోచన చాలా అవసరం.

h **వృశ్చికం** : కాంట్రాక్టర్లకు బిల్లులు మంజూరవుతాయి. మీరు అనుకున్న సాహసో పేతమైన నిర్ణయాలు మంచి ఫలితాలనిస్తాయి. వ్యాపారాల్లో నిలదొక్కు కోవటానికి మరింతగా శ్రమించవలసి ఉంటుంది. ఉద్యోగస్తులకు పై అధికారుల నుంచి ఒత్తిడి, చికాకులను ఎదుర్కొంటారు. ప్లీడర్లకు, ప్లీడరు గుమస్తాలకు, వైద్యులకు అను కూలత


.i **ధనుస్సు** : స్థిరాస్థులు విక్రయించాలనే ఆలోచన విరమించు కోవడం మంచిది. విద్యార్థులకు మిత్రబృందాల వల్ల సమస్యలు తలెత్తే ఆస్కారం ఉంది మెళకువ వహించండి. బ్యాంకు వ్యవహారాలలో అపరిచిత వ్యక్తులపట్ల మీ కృషికి తగిన ప్రతిఫలం ఉంటుంది. స్త్రీలతో అతిగా సంభాషిం చటం వల్ల అపార్థాలకు గురికావలసి వస్తుంది.

j **మకరం** :వృత్తిపరమైన సమా వేశాలకు అనుకూలం. లక్ష్యసాధనకు మీరే చేసే ప్రయత్నాలు ఫలిస్తాయి. న్యాయ, బోధన కళారంగాల వారికి శ్రమకు తగిన ప్రతిఫలం లభిస్తుంది. దీక్షా పట్టుదలతో అనుకున్న లక్ష్యం సాధిస్తారు. వ్యాపారాల్లో భాగస్వామి సహాయ సమకారం లభిస్తుంది.

k **కుంభం** : రాజకీయ, సినీరంగ కళాకారులకు శుభప్రదం. మీ ప్రతిభకు గుర్తింపు లభిస్తుంది. దూర ప్రయాణాలకు సంబంధించి ప్రయత్నాలు ఫలిస్తాయి. దీర్ఘకాలంగా వాయిదాపడిన పనులు పూర్తిఅగును. పై అధికారుల మన్నలు పొందుతారు. **మీనం** : శారీరక శ్రమ, అకాల భోజనం వల్ల ఆరోగ్యం మందగిస్తుంది. ప్రియ మైన వ్యక్తులను కలుసుకుంటారు. ఉద్యోగ స్తులకు పెండింగ్ పనులపై దృష్టి సారి స్తారు. ఆలయాలను సందర్శిస్తారు. స్టాక్ మార్కెట్ రంగాల వారి అంచనా నిరుత్సా హపరుస్తాయి. ఏ విషయంలోను హామీ ఇవ్వకుండా లౌక్యంగా దాటవేయండి..

# సంపదలను ప్రసాదించే శివుడు

సంకీర్తన



జీవితాన్ని ఆర్థిక పరిస్థితి ఎంతగానో ప్రభావితం చేస్తుంది. అన్ని ఆనందాలు .. సంతోషాలు ఆర్థిక పరిస్థితితో ముడిపడి లేకపోయినా, అది చూపించే ప్రభావం ఎక్కువగానే ఉంటుంది. అవసరాలు .. ఆపదల బారినుంచి బయట పడటానికి ఆర్థిక పరిస్థితి బాగా ఉండవలసిందే. అలాంటి పరిస్థితుల్లో ఆయురారోగ్యాలతో పాటు ప్రతి ఒక్కరూ సంపదలను కూడా భగవంతుడిని కోరుతుంటారు.

ఇలా సంపదలను పొందాలనుకున్నవాళ్లు, పరమశివుడిని పూజించడం వలన ఫలితం ఉంటుందని ఆధ్యాత్మిక గ్రంథాలు చెబుతున్నాయి. సోమవారం పరమ శివుడికి అత్యంత ప్రీతికరమైన రోజు. ఈ రోజున స్వామివారిని మారేడు దళాలతోను .. శంఖు పుష్పాలతోను పూజించడం వలన, సంపదలు చేకూరుతాయని ఆధ్యాత్మిక గ్రంథాలు స్పష్టం చేస్తున్నాయి. అందువలన ఆర్థికపరమైన ఇబ్బందుల నుంచి బయటపడాలనుకునేవాళ్లు, సదాశివుడిని ఈ రీతిగా పూజించి ఆయన అనుగ్రహాన్ని పొందవచ్చు.

## ఆపదలు తొలగించే అమ్మవారు

శక్తి స్వరూపిణి అయిన అమ్మవారు ఏ రూపంలో వున్నా .. ఏ పేరుతో కొలవబడుతూ వున్నా అమ్మ ప్రేమతో అనుగ్రహిస్తూనే ఉంటుంది. అందువల్లనే అమ్మవారి ఆలయాలు ఎక్కడ వున్నా భక్తులతో నిత్యం సందడిగా కనిపిస్తూనే ఉంటాయి. అమ్మవారిని పూజించడం వలన సౌభాగ్యం నిలుస్తుందని .. సంపదలు కలుగుతాయని భక్తులు విశ్వసిస్తుంటారు.

ఇక అమ్మవారు ఆవిర్భవించిన 'అష్టమి' తిథి రోజున ఆ తల్లిని పూజించడం మరింత మంచిదని ఆధ్యాత్మిక గ్రంథాలు చెబుతున్నాయి. అష్టమి రోజున అమ్మవారిని పూజించడం వలన .. పారాయణం చేయడం వలన .. ఆ రోజున 8 రకాల వంటకాలు నైవేద్యంగా సమర్పించడం వలన విశేషమైన ఫలితాలు కలుగుతాయి. ముఖ్యంగా అనారోగ్యాలు .. ఆపదలు దరిచేరవు. జీవితాన్ని అనారోగ్యాలు .. ఆపదలు అతలాకుతలం చేస్తుంటాయి. అందువలన అలాంటి గండాల బారిన పడకుండా అష్టమి రోజున అమ్మవారిని ఆరాధిస్తూ ఉండాలి.



# నూతన, మాజీ ఎంపీడీవోలకు సత్కరించిన ఎంపీపీ శెట్టి నీలవేణి





అనంతగిరి(విజయభాను న్యూస్) : మండల అభివృద్ధి అధికారిగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన నూతన ఎంపీడీవో హర్షిత్ రాజాంలి అదేవిధంగా బదిలీపై వెల్లిన ఎంపీడీవో నగేష్‌లికు వీడ్కోలు పలికిన అనంతగిరి ఎంపీపీ శెట్టి నీలవేణిలి గురువారంతో దుస్సాలు వాలతో సత్కరించారు. ఎంపీపీ నీలవేణి ఎంపీడీవో శ్రీహర్షిత్ తన చాంబర్లో గురువారం మర్యాదపూర్వకంగా కలవగా ఇద్దరు ఎంపీడీవోలకు ఆమె సత్కరించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో గా నిరంతరం అందుబాటులో ఉంటూ సేవలందించిన నగేష్ సేవలను ఆమె కొనియాడారు. అదే విధంగా నూతన ఎంపీడీవో శ్రీహర్షిత్ మండలంలో అందుబాటులో ఉంటూ మండల అభివృద్ధికి కృషి చేస్తానని ఈ సందర్భంగా ఆమెకు హామీ ఇచ్చారు.

మంచి దృక్పథంతో ప్రజాసేవలో కలిసి పనిచేద్దామని ఆమె ఈ సందర్భంగా అన్నారు ..

అదేవిధంగా ఎంపీడీవోలు ఇద్దరకు సర్పంచులు ఫోరం అధ్యక్షులు లిపాగి అప్పారావులి పూల మాలలతో సత్కరించారు.ఈ కార్యక్రమంలో ఈ ఓ ఆర్ డి మల్లేశ్వరరావు, ఏవో లక్ష్మీనారాయణ, సీనియర్ అసిస్టెంట్ రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా మాజీ ఎమ్మెల్యే గండి జన్మదిన వేడుకలు

## ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపిన పిజెఆర్, కెవిఆర్



అనంతగిరి(విజయభాను న్యూస్) : పరవాడ మాజీ శాసనసభ్యులు, తెలుగుదేశంపార్టీ సౌత్ జోన్ ఇంచార్జి గండి బాబ్జి జన్మదిన వేడుకలు గురువారం వైజాగ్ పార్టీ కార్యలయంలో అంగరంఘ వైభవంగా జరిగాయి. ఈయన్ను పరవాడ మాజీ అర్ ఇసియస్ చైర్మన్, మాజీ జడ్పిటిసి, మాజీ ఎంపిపి పైల జగన్నాదరావు, అనకాపల్లి మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ కన్నూరు వెంకటరమణ అద్వర్యంలో నాయకులు, కార్యకర్తలు కలిసి శుభాకాంక్షలు తెలియజేసారు.ముందుగా పైలజగన్నాదరావు (పిజెఅర్ )మరియు కన్నూరు వెంకటరమణ (కెవిఅర్)పుష్పగుచ్చం అందజేసి మర్యాద పూర్వకంగా కలిసారు. అనంతరము జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పలువురూ వక్తలు మాట్లడుతూ మాజీ ఎమ్మేల్యే గండిబాబ్జి అంటే ఒకపేరు కాదు అని అయన ఒకశక్తి అని అన్నారు. నిరుపేదలు పాలిట సింహస్వప్నమనీ ,కార్యకర్తకు ఏకష్టమొచ్చినా ముందుండే నాయకుడు గండి బాబ్జిఅని కొనియాడారు.

ఏంతో మంది కార్యకర్తలును నాయకులుగా తీర్చిదిద్దిన ఏకైక నాయకుడు గండి బాబ్జిఅని అన్నారు. అయన ఇటువంటి జన్మదిన వేడుకలు మరిన్నీ జరిపికోవాలానీ రానున్న రొజుల్లో అయన ఏంచుకున్న రాజకీయ రంగంలో ఉన్నత స్దాయికి ఏదుగాలానీ అకాక్షించారు. ఈ కార్యక్రమంలో గోర్లివానిపాలెం మాజీ సర్పంచ్ గోర్లికనకారావు, మంత్రి గిరిప్రసాద్ , వర్రి వసంతరావు,ఎల్ ఐసి అప్పారావు, ఎల్ ఐసి నాయుడు,పర్మేష్ , వర్రి రమణ, పైల ఈసు, అప్పారావు మరియు పిజెఅర్ యువసేన సభ్యులు,కెవిఅర్ యువసేన సభ్యులు అధిక సంఖ్యలో పాల్గోన్నారు.

# రక్ష హరికృష్ణకు ఘన నివాళి



యానాం (విజయభాను న్యూస్) : మాజీ శాసన సభ్యులు రక్ష హరికృష్ణ 82 వ జయంతిని పురస్కరించుకొని గురువారం ఉదయం మెట్టకురు గ్రామంలో రక్షా హరికృష్ణ విగ్రహానికి పుదుచ్చేరి ఢిల్లీ అధికార ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు పూల మాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఆయన చేసిన సేవలను కొనియాడారు. అగ్నికుల క్షత్రియ సంఘ పెద్దలు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పల్లవసేన సభ్యులు, మెట్టకురు గ్రామ ప్రజలు పెద్దలు అధిక సంఖ్యలో పాల్గొని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి బాణాసంచా కాల్చి కేక్ కటింగ్ చేసి కార్యక్రమంలో పాల్గొన్న ప్రజలందరికీ స్వీట్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంలో భాగంగా పుదుచ్చేరి ఢిల్లీ అధికార ప్రతినిధి మల్లాడి కృష్ణారావు మాట్లాడుతూ రక్ష హరికృష్ణ యానం ప్రజలకు చేసిన సేవలను గుర్తు చేసుకుని బడుగు బలహీన వర్గాల ప్రజల కోసం తమ ఉద్యోగాన్ని వదులుకొని యానం ప్రజలకు సేవ చేయాలని సంకల్పంతో రాజకీయ రంగ ప్రవేశాన్ని చేసి 1990లో మొట్టమొదటిసారిగా శాసనసభ్యునిగా ఎన్నికయ్యారని గుర్తు చేయడం జరిగింది. ఈ కార్యక్రమం అనంతరం యానాం ఫెర్రీ రోడ్ లో ఉన్న రక్ష హరికృష్ణ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి జయంతి వేడుకలను నిర్వహించారు.

# తాళ్ళరేవు మండల నాయకులు ఆధ్వర్యంలో తహాశీల్దార్ పోతురాజు కి వినతిపత్రం అందజేత



తాళ్ళరేవు (విజయభాను న్యూస్) : కాకినాడ జిల్లా తాళ్ళరేవు మండలంలో తెలుగుదేశం పార్టీ తాళ్ళరేవు మండల నాయకులు ఆధ్వర్యంలో స్థానిక రేషన్ షాపు వద్ద మరియు తాహశిల్దార్ కార్యాలయం వద్ద కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న ఉచిత రేషన్ తెల్లరేషన్ కార్డులు కలిగిన అందరికీ ఇవ్వాలని ధర్నా చేశారు, అనంతరం తాహశిల్దార్ పోతురా కి వినతిపత్రం అందజేశారు, ఈ సందర్భంగా ముమ్మిడివరం నియోజకవర్గ సమన్వయ కమిటీ సభ్యుడు ధూళిపూడి వెంకటరమణ (బాబి) మాట్లాడుతూ ప్రజలకు ఆహర భద్రతను కల్పించవలసిన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పేదల నోటి దగ్గరి కూడును దోచుకుంటూ ఉచిత బియ్యః విదేశాలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు, కేంద్ర ప్రభుత్వం పీఎంజికెఏవై పథకం ద్వారా పేదలందరికీ ఉచిత బియ్యం అందేలా కరోనా సమయంలో ఈ పథకం ప్రారంభించిది. అమలాపురం పార్లమెంటు అధికార ప్రతినిధి టేకుమూడి లక్ష్మణరావు మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి ఏప్రిల్ 2022 నుండి పేదలకు బియ్యం పంపిణీ చేయకుండా మోసం చేస్తున్నారు అన్నారు, మన జిల్లా నుంచే ఉచిత బియ్యం రీసైక్లింగ్ చేసి విదేశాలకు తరలిస్తున్నారు అన్నారు, ముమ్మిడివరం నియోజకవర్గ యస్సీ సెల్ కార్యదర్శి జక్కల ప్రసాద్ మాట్లాడుతూ ఉచితంగా ఇచ్చే బియ్యం లో కూడా ప్రభుత్వం ఆకలికి కూడా కులం పేరుతో , ప్రాంతం పేరుతో వివక్ష చూపిస్తూ పేదలపై కక్ష సాధిస్తున్నారు అన్నారు, ఈ కార్యక్రమంలో వుంగరాల వెంకటేశ్వరరావు, మాజీ సర్పంచ్ వాశంశెట్టి శ్రీనివాస్, కట్టా త్రిమూర్తులు, పితాని విష్ణు, కుడిపూడి రామకృష్ణ, దుర్గా ప్రసాద్, కే.శ్రీనివాస్, మౌళి, వేణుగోపాల్, అంజి , గుత్తుల వెంకన్న , కూరాటి రాము , వీరన్న యాదవ్, బాలరాజు, వీరబాబు, వస్కారెడ్డి, గోపి, పాండురంగ, మురళి, చంటి , సుబ్బారావు, దేవా తదితరులు పాల్గొన్నారు.

# అన్నదాత బాగుండాలని తపించే వ్యక్తి జగన్

## పాడేరు లో రాజ్ మా విత్తనాల పంపిణీ కార్యక్రమంలో

## పాడేరు శాసనసభ్యులు కొట్టగుల్లి భాగ్యలక్ష్మి





పాడేరు (విజయభాను న్యూస్) : ఆంధ్రప్రదేశ్ గౌరవ ముఖ్యమంత్రి వరులు శ్రీ వైయస్ జగన్మోహన్ రెడ్డి నిరంతరం దేశానికి అన్నం పెట్టి రైతన్న బాగుండాలని తపించే వ్యక్తి అని పాడేరు శాసనసభ్యులు శ్రీమతి కొట్టగుళ్ళి భాగ్యలక్ష్మి పేర్కొన్నారు. పాడేరు మండలం గుత్తులపుట్ రైతు భరోసా కేంద్రంలో సబ్సిడీపై ప్రభుత్వం అందించిన రాజ్ మా విత్తనాలను భాగ్య లక్ష్మి గురువారం పంపిణీ చేశారు. సుమారుగా 1300 మంది రైతులకు తన చేతుల మీదుగా రాజ్ మా విత్తనాలను భాగ్యలక్ష్మి అందజేశారు. పాడేరు మండల రైతుల కోసం ప్రభుత్వం 132 క్వింటాళ్ల రాజ్ మా విత్తనాలను సరఫరా చేసిందని ఇవన్నీ 90 శాతం సబ్సిడీపై రైతులకు ఈ ప్రభుత్వం అందజేస్తుందని ఆమె స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సోనారి రత్నకుమారి ఎంపిటిసి లు దూసూరు సన్యాసయ్య , లకే రామకృష్ణ పాత్రుడు , నరసింహ మూర్తి సర్పంచ్ లు, .జి.నీల కంఠం, ఎస్. రాంబాబు,కె. ఈశ్వరమ్మ. సన్నిబాబువి.బసవన్న దొర,ఎల్. పార్వతమ్మ వి. సీతమ్మ ,వైఎస్సార్ కాంగ్రెస్ నాయకులుకార్యకర్తలు పాల్గొన్నారు.



# 19 లక్షల నిధులు మంజూరు చేసిన ఎన్టీపిసి యాజమాన్యం

## ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపిన ఉప సర్పంచ్ సన్యాశిరావు

పరవాడ (విజయభాను న్యూస్) : పరవాడ మండలం వెన్నలపాలెంలో గల ఎసి కళ్యాణమండపానికి టాయిలెట్స్ ,బాత్ రూం లు నిమిత్తం ఎన్టీపిసి యాజమాన్యం వారు సియస్ అర్ నిధుల్లో బాగంగా ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్ రాజ్ కృషితో 19లక్షల రూపాయాలు నిధులు మంజూరు చేసారు.. ఎన్టీఎసి కళ్యాణ మండపం అభివృద్ది కొరుకు నిదులు మంజూరు చేసిన ఎన్టీపిసి యాజమాన్యానికి,ఎమ్మేల్యే అన్నంరెడ్డి అదీప్ రాజ్ కువెన్నలపాలెం ఉప సర్పంచ్ వెన్నల సన్యాశిరావు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియపరిచారు. ఈసందర్భంగా ఉప సర్పంచ్ వెన్నలసన్యాశిరావు (భూపతి) మాట్లడుతూ ఎన్టీపిసి సేవలును కొనియాడారు..ఇదేవిధంగా వెన్నలపాలెం అభివృద్దికి ఎన్టీపిసి యాజమాన్యం ఎల్లప్పుడూ చేయూతను ఇవ్వాలానీ ఈ సందర్భంగా అయన ఉప సర్పంచ్ భూపతి సన్యాశిరావు కోరారు.

# 3న సర్వసభ్య సమావేశాన్ని జయప్రదం చేయండి



పరవాడ (విజయభాను న్యూస్) : ఈనెల 3వతేదీన పరవాడ ఎంపిపి పైల వెంకట పద్మలక్ష్మిశ్రీనువాస్ అద్యక్షతన సాధారణ సర్వసభ్యాసమావేశం జరుగునుందనీ ఎంపిడిఒ హేమసుంధర్ రావు తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎమ్మేల్యే అన్నంరెడ్డి అదీప్ రాజ్ ,ఎంపి సత్యవతిమ్మ, జడ్పిటిసి పియస్ రాజు హజరు అవుతారు అన్నారు. కావున మండలంలో గల అదికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గోనాలానీ కోరారు.

# దక్షిణ నియోజకవర్గములో పలు వినాయక మండపాలను సందర్శించిన కార్పొరేటర్ కందుల నాగరాజు



విశాఖపట్నం (విజయభాను న్యూస్) : విశాఖ దక్షిణ నియోజకవర్గంలో పలు వినాయక మండపాలను 32 వ వార్డు కార్పొరేటర్ కందుల నాగరాజు సందర్శించారు .ముఖ్యంగా సరస్వతి పార్కు కృష్ణా గార్డెన్స్ డాబాగార్డెన్స్ అల్లిపురం బంగారమ్మ మెట్ట ప్రాంతాల్లో శ్రీ సిద్ధి వినాయక మండపాలను దర్శించి స్వామివారి దర్శనం చేసుకున్నారు ఈసందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మండప ఉత్సవ కమిటీ సభ్యులు ఆయనకు దర్శనానంతరం దుశ్శాలువతో సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు .ఈ సందర్భంగా కందుల నాగరాజు మాట్లాడుతూ ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ వివిధ రంగులు తో కూడిన వినాయక విగ్రహాలను నీటి ప్రవాహాల్లో ,నదుల్లో నిమజ్జనం చేయడంవల్ల నీటి కాలుష్యం ఏర్పడుతుందన్నారు. ఆరోగ్యం లేనిదే జీవనం కష్టతరమవుతుందని అందువలన అందరం మన చుట్టూ ఉన్న పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరూ ఈ వినాయక చవితిని ఆనందంగా జరుపుకోవాలని వినాయక చవితి శుభాకాంక్షలు తెలియజేశారు. విఘ్నాలు లేకుండా రాష్ట్రాభివృద్ధికి గణేషుడి ఆశీస్సులు ఉండాలని ఆకాంక్షించారు.

# వైయస్సార్ వర్ధంతిని జయప్రదం చేద్దాం

## .. ఎంపీపీ శెట్టి నీలవేణి



అనంతగిరి, విజయభాను న్యూస్ : మహానేత, పేదలపాలిట పెన్నిది, అందరి గుండెల్లో చిరస్మరనీయులు ,మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ డా..వైఎస్ రాజశేఖర రెడ్డి గారి వర్ధంతి సందర్భంగా సెప్టెంబర్ 2న అనంతగిరి మండల కేంద్రం లోని వైఎస్సార్ విగ్రహానికి పాలాభిషేకం చేసి నివాళులు అర్పించాల్సిన బాధ్యత మన అందరిపైన ఉందనీ వైఎస్సార్సీపీ జాతీయ అధ్యక్షులు ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు అరకులోయ శాసన సభ్యులు చెట్టి ఫాల్గుణ సూచనలను అనుసరించి అనంతగిరి లో పాలాభిషేకం సెప్టెంబర్2న ఉదయం 10 గంటలకు నిర్వహించాలని మండలం పార్టీ అధ్యక్షుడు శెట్టి ఆనంద్ నిర్ణయించారు. ఈ బృహత్ కార్యక్రమంలో ఎంపీటీసీ లు, సర్పంచ్ లు,డైరెక్టర్ లు,పార్టీ అభిమానులు, కార్య కర్తలు, అందరూ హాజరై విజయవంతం చేయాలని ఒక ప్రకటనలో విలేకరులకు తెలియపరిచారు.

# రావాడలో జగనన్న సమగ్రభూ రీసర్వే



పరవాడ (విజయభాను న్యూస్) : రాష్ట్ర వ్యాప్తంగా రైతులకు మేలు జరగాలనే సంకల్పంతో ముఖ్యమంత్రి వర్యులు వైయస్ జగన్మోహన్ రెడ్డి తలపెట్టిన జగనన్న సమగ్ర భూసర్వే గురువారం పరవాడ మండలం, రావాడ పంచాయతీలో పరవాడ మండల వైస్ ఎంపీపీ బంధం నాగేశ్వర రావు, రావాడ గ్రామ సర్పంచ్ మోటూరు సన్యాసినాయుడు మరియు పరవాడ మండల వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ కోన రామారావు చేతులమీదుగా ప్రారంభించబడినది. ఈ కార్యక్రమంలో రావాడ సెక్రెటరీ అనురాధ ,మాజీ ఎంపీటీసీ కావాలి రాజు , జమ్ముల అశోక్, మోటూరు అప్పలనాయుడు , పల్లా గోవింద్ , మోటూరు వీరునాయుడు తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ మార్గంలో తరలిపోతున్న రేషన్ బియ్యం

## రేషన్ బియ్యం స్మగ్లింగ్ చేస్తున్న ట్రాక్టర్ స్వాధీనం

కా్రేనికోన (విజయభాను న్యూస్) : కత్రేనికోన మండలం నుంచి అక్రమ మార్గంలో తరలిపోతున్న రేషన్ బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. 2.5 టన్నుల రేషన్ బియ్యం ట్రాక్టర్ స్వాధీనం చేసుకుని స్మగ్లర్ ను అదుపులోకి తీసుకున్నారు.

పేదలకు ప్రభుత్వం పంపిణీ చేస్తున్న రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేసి వాటిని ఆటోలు ట్రాక్టర్ల ద్వారా మిల్లులకు సరఫరా చేస్తూ తప్పించుకు తిరుగుతున్న కంది కుప్ప కు చెందిన విత్తనాల విష్ణుమూర్తి అలియాస్ బుజ్జి అనే రేషన్ స్మగ్లర్ను గురువారం కా్రేనికోన పోలీసులు అదుపులోకి తీసుకున్నారు కంది కుప్ప నుండి మురమళ్ళ వెళుతున్న రేషన్ బియ్యం తో కూడిన ట్రాక్టర్ను పోలీసులు స్వాధీనం చేసుకోవడంతో డొంక బయటపడింది 2.5 టన్నుల రేషన్ బియ్యం ట్రాక్టర్ ను స్వాధీనం చేసుకుని డ్రైవర్ను అదుపులోకి తీసుకొని విచారించగా కందికుప్ప కి చెందిన విష్ణుమూర్తికి చెందిన బియ్యంగా సదర్ డ్రైవరు పోలీసులకు తెలపడంతో ఎంతో కాలంగా రేషన్ బియ్యాన్ని మిల్లులకు సరఫరా చేస్తున్నా నిందితుడిని పోలీసులు అదుపులో తీసుకున్నారు.

# వైసీపీ కార్యాలయంకు గిరిజనుల సాగు భూమి ఎలా కేటాయిస్తారు?

**- అటవీ హక్కుల చట్టం నిబంధనలను ఉల్లంఘించిన పాడేరు తహశీల్దార్**

**- వైసీపీ కార్యాలయానికి ఏజెన్సీ ప్రాంతం లో భూమికి కేటాయించడం చట్టవిరుద్ధం**



అల్లూరిజిల్లా. విజయభాను. పాడేరు : అధికార మదంతో ఏజెన్సీ ప్రాంతాల్లో అక్రమ మైనింగ్, భూమి ఆక్రమణ దారులకు కొమ్ముకాయడం వైసిపి ఎమ్మెల్యే భాగ్య లక్ష్మి తగదురైతులతో సిపిఎం ప్రతినిధి బృందం వైసిపి ఆఫీస్ స్థలం సందర్శనపాడేరు జిల్లా కేంద్రంలో వైసిపి కార్యాలయానికి గిరిజనుల సాగు చేస్తున్న బంజర భూమిని కేటాయించడం చట్టవిరుద్ధమైనదని సిపిఎం పార్టీ మండల కార్యదర్శి ఎల్ సుందర్రావు ప్రకటనలో పేర్కొన్నారు.అల్లూరి సీతారామ జిల్లా పాడేరు జిల్లా కేంద్రంలో వైసీపీ కార్యాలయం నిర్మాణానికి సుమారు 50 సెంట్లు స్థలాన్ని పాడేరు తహశీల్దార్ మంజూరు చేశారు. వైసీపీ కార్యాలయానికి కేటాయించిన స్థలంలో నడిం వీధి, చింతల వీధి, బీమా సింగ్,ఉబ్బెడి పుట్టు రైతులతో కలిసి సిపిఎం ప్రతినిధి బృందం నేడు సందర్శించారు. వైసిపి కార్యాల యానికి కేటా యించిన స్థలంలో గతం నుంచి సిల్వర్, కాఫీ, మిరియాలు మొక్కలు గిరిజనులు సాగు చేస్తున్నారు. అటవీ హక్కుల చట్టం ప్రకారంగా సాగు చేస్తున్న పోడు భూమికి పట్ట ఇవ్వాలని గిరిజనులు చేసుకున్న దరఖాస్తులకు నేటికీ హక్కు పత్రాలు మంజూరు చేయలేదు. అటవీ హక్కుల చట్టం ప్రకారంగా సాగు దారులకు వ్యక్తిగత, ఉమ్మడి పత్రాలు మంజూరు చేసిన తర్వాత గిరిజనుల దగ్గర నుండి గిరిజన గ్రామ సభ ఆమోదముతో ప్రభుత్వ అవసరాల కోసం భూమి తీసుకోవచ్చుని, వైసిపి ఎమ్మెల్యే పాడేరు భాగ్య లక్ష్మి మాత్రం అధికార మదంతో నడుం వీధిలో భూమి ఆక్రమించడం సరికాదు. ఏజెన్సీ ప్రాంతాల్లో అక్రమ మైనింగ్, భూమి ఆక్రమణ దారులకు పాడేరు ఎమ్మెల్యే భాగ్య లక్ష్మి సహకారం అందించడం దారుణం. గిరిజన గ్రామా సభ ఆమోదం లేకుండా గిరిజన చట్టాలను ధిక్కరించి పాడేరు తహశీల్దార్ వైసిపి కార్యాలయానికి స్థలం కేటాయించారు. ఏజెన్సీ ప్రాంతంలో వైసిపి పార్టీకి స్థలం కేటాయించడం గిరిజన చట్టాలకు విరుద్ధమైనది. గిరిజన రైతులు భూముల్లో తక్షణమే పోడుపట్ట మంజూరు చేయాలని, వైసిపి కార్యాలయానికి కేటాయించిన స్థలాన్ని రద్దు చేయాలని సిపిఎం డిమాండ్ చేస్తుంది.

# పేద ప్రజల కడుపు కొడుతున్న రాష్ట్ర వైసీపి ప్రభుత్వం

## - మండల టీడీపీ నాయకులు అంటిపర్తి బుజ్జి బాబు



అనంతగిరి, విజయభాను న్యూస్ : అనంతగిరి మండలంలో తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారి పిలుపు మేరకు అరకు నియోజకవర్గ ఇన్చార్జి మాజీ మంత్రి కిడారి శ్రావణ్ కుమార్ అదేశాల మేరకు మండల టీడీపీ అధ్యక్షుడు బుజ్జి బాబు అధ్వర్యంలో జరిగిన నిరసనకార్యక్రమం ఈరోజు మండల తహశీల్దార్ కి వినతిపత్రం అందజేయడం జరిగింది అనంతరం వ్యక్తలు మాట్లాడుతూ రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రేషన్ కార్డులు కోత పెట్టి 1.44 కోట్లకు కుదించారని,ప్రధానమంత్రి గరీబ్ కల్యాణ్ అన్న యోజన పథకం (పి ఎం జి కె ఎ వై) కింద 89లక్షల మందికి - మాత్రమే ఉచిత బియ్యం ఇస్తూ 55 లక్షల కార్డు దారులకు ఎగనామం పెట్టారన్నారు.అదే సమయంలో కేంద్రం ఇచ్చిన రేషన్ బియ్యంలో రూ.2 వేల కోట్ల విలువైన 5.66 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం జగన్ రెడ్డి పేదలకు పంచకుండా పక్కదారి పట్టించారని పార్లమెంటులో కేంద్రమంత్రి ప్రకటించారన్నారు. 2018 - 19లో టీడీపీ పాలనలో ఏపీ నుండి విదేశాలకు బియ్యం ఎగుమతులు 18లక్షల మెట్రిక్ టన్నులు ఉండగా, 2020-21 లో జగన్ రెడ్డి పాలనలో ఒక్క ఏడాదే 31.51 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం ఎగుమతి చేశారని,టీడీపీ హయాంలో కంటే పంటల దిగుబడులు తగ్గాయని, చెబుతూనే 13.50 లక్షల మెట్రిక్ టన్నులు ఎక్కువ బియ్యం ఎగుమతి ఎలా చేశారని ప్రశ్నించారు.పేదలకు బియ్యం ఇవ్వకుండా కిలోకు రూ.5-7 ఇచ్చి బియ్యం పంపిణీ వాహన నిర్వాహకులు వాలంటీర్లు బియ్యాన్ని రీ సైక్లింగ్ పంపిస్తున్నారని,మూడేళ్లలో అలా పంపిన బియ్యం విలువ రూ.4,700 కోట్లు, కేంద్రం ఇచ్చిన బియ్యాన్ని పక్కదారి పట్టించిన రూ.2 వేల కోట్ల విలువైన బియ్యం, అడ్డగోలుగా బొక్కేసిన రూ. 1700 కోట్ల విలువైన బియ్యం మొత్తంగా రూ.7 వేల కోట్ల విలువైన బియ్యం విదేశాలకు తరలించి పేదల కడుపు కొడుతున్నారని ఉచిత బియ్యం కూడ పంపిణీ చేయకుండా నిలిపివేశారని అన్నారు.

ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు బుజ్జి బాబు,మాజీ జిల్లా వైస్ చైర్మన్ అప్పారావు, జిల్లా కార్యవర్గ సభ్యులు జొగులు,కొత్తూరు వైస్ ప్రెసిడెంట్ గాలి నరశింహ మూర్తి, (నరేంద్ర,)టీడిపి సీనియర్ నాయకులు బిడ్డ లక్ష్మణ్, దొన్ను, శ్యామ్,దన్ను,రాజు,రవీంద్ర,టీడిపి కార్యక్తలు తదితరులు పాల్గొన్నారు.

# వైద్య కళాశాల నిర్మాణంలో చెట్లకు వేలం పాట

## రూ.20.10లక్షలకు వేలం పాట ఖరారు





మాకవరపాలెం (విజయభాను న్యూస్) : మాకవరపాలెం మండలం భీమబోయినపాలెం పంచాయతీ పరిధిలో ప్రభుత్వ వైద్య కళాశాల నిర్మాణానికి సంబంధించి కేటాయించిన 52.16 ఎకరాల భూముల్లోని చెట్లకు రాష్ట్ర ప్రభుత్వం నియమించిన ఉన్నతాధికార కమిటీ గురువారం వేలం పాట నిర్వహించింది. నర్సీపట్నం ఆర్డీవో భవానీశంకర్ నేతృత్వంలో ఆంధ్ర వైద్య కళాశాల ప్రిన్సిపాల్ బుచ్చిరాజు, వైద్య సదుపాయాల మౌలిక సంస్థ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ అచ్చియ్యనాయుడు, ఎంపిడిఒ అరుణశ్రీ, తహశీల్దార్ ప్రసాదరావు సభ్యులుగా నిర్వహించిన వేలం పాటకు 25 మంది హాజరు కాగా అనకాపల్లి సమీపంలోని నాగాలాపల్లి గ్రామానికి చెందిన కలప వ్యాపారి రామచంద్రరావు మొత్తం చెట్లను రూ.20.10లక్షలకు వేలంపాట ఖరారు చేశారు. ఈ సందర్భంగా ఆర్డీవో ఇతని పేరును చెట్ల వేలం పాట ఖరారైనట్లు అధికారికంగా ప్రకటించారు.

ఈ కార్యక్రమానికి..!

తొలిత అభ్యంతరం చెప్పిన టీడీపీ నాయకులు ఎవరూ హాజరు కాకపోగా వైసిపి నాయకులు వేలంపాటలో పాల్గొనడం గమనార్హం. టీడీపీ హెచ్చరికలతో గొడవలు జరుగుతున్న ఉద్దేశ్యంతో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. అయితే ఎటువంటి గొడవలు జరగకుండా వేలంపాట ప్రశాంతంగా జరిగింది.

# ఘనంగా పరవాడ మరిడిమాంబ పండుగ

## భారీ అన్నసమారాధన- విశేష స్పందన





పరవాడ (విజయభాను న్యూస్) : మండల కేంద్రమైన పరవాడ ఇలవేల్పు శ్రీశ్రీశ్రీ మరిడిమాంబ అమ్మవారి పండుగ గురువారం అంగరంఘ వైభవంగా జరిగింది.భక్తులు వేకువజాము నుండి అమ్మవారిని దర్శించికోని ప్రత్యేక పూజలు చేసారు.అనంతరము ఏర్పాటు చేసిన అన్నసమారాధనను వైసిపి సిఇసి సభ్యులు పైల శ్రీనువాసురావు హజరై అయన చేతులుమీదగా ప్రారంభించారు.

ఈ అన్నసమారాధనకు విశేష స్పందన లభించింది. చుట్టు పక్కల ప్రజలు అందరూ వచ్చి ఈ అమ్మవారి ప్రసాదమును స్వీకరించారు. అమ్మవారిని మాజీమంత్రి వర్యులు బండారు సత్యనారాయణమూర్తి, మాజీ జడ్పిటిసి పైలజగన్నాధరావు,పరవాడ సర్పంచ్ సిరపురపు అప్పలనాయుడు, వైసిపి జిల్లా ప్రదాన కార్యదర్శిచుక్కరాము నాయుడు, టిడిపి సినియర్ నాయకులు పైల సన్యాశిరావు మాష్టర్ ,టిడిపి మండలపార్టి అద్యక్షులు వియ్యపుచిన్నా,గొర్లివానిపాలెం మాజీ సర్పంచ్ గొర్లి కనకారావు,టిడిపి జడ్పిటిసి అభ్యర్ధి అట్టా సన్యాశి అప్పారావు, వైస్ సర్పంచ్ బండారు రామారావు, పెదచెరువు అయకట్టుదారుల సంఘం ప్రెసిడెంట్ రెడ్డి శ్రీనువాసురావు ,చిన్నా,తధీతర్లు అమ్మవారిని దర్శించుకోని ప్రత్యేక పూజలు చేసారు. ఈకార్యక్రమంలో బండారు సత్యనారాయణ, పైల బుజ్జి, చుక్క వెంకటరావు, ఇందల కొండలరావు, పైల కృష్ణ,గండి మహేష్ ,నాయకులు,కార్యకర్తలు తథితర్లు పాల్గోన్నారు. సాయంత్రము ఏర్పాటు చేసిన పలు సంస్కృతి కార్యక్రమాలు ప్రజలును ఏంతగానో అకట్టుకున్నాయి.

# సేవా మార్గంలో పరిపాలన సాగించడం

## జనసేన అధ్యక్షుడు కొణిదెల పవన్ కళ్యాణ్ తోనే సాధ్యం

## జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొలిశెట్టి సత్యనారాయణ



విశాఖపట్నం (విజయభానున్యూస్) : సేవా మార్గంలో పరిపాలన సాగించడంలో జనసేన అధ్యక్షుడు కొణిదెల పవన్ కళ్యాణ్ తోనే సాధ్యమనీ జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొలిశెట్టి సత్యనారాయణ అన్నారు. ఈ సందర్భంగా గురువారం జనసేన దక్షిణ నియోజకవర్గ నాయకులు మూగి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో 41వ వార్డులో గల జ్ఞానాపురంలో మెగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ స్వచ్ఛమైన పాలనతో రాష్ట్రాభివృద్ధి సాధ్యమనీ, ప్రతీ జన సైనికులు ఆయన మార్గాన్ని అనుసరించి పేదలకు సేవ చేసే కార్యక్రమాలలో పాల్గొనడం చాలా సంతోషమన్నారు. పవన్ జన్మదిన సందర్భంగా ప్రభుత్వ విక్టోరియా ఆసుపత్రి సౌజన్యంతో రక్తదానం చేయడం చాలా సంతోషమన్నారు. రక్తహీనతో అనేక మంది గర్భిణులు, మహిళలు బాధపడుతున్నారనీ వారిని ఆదుకునేందుకు ఈ రక్తదానం శిబిరం ఎంతగానో దోహదపడుతుందన్నారు. రక్తదానంతో పాటు అనేక సేవా కార్యక్రమాలు జనసైనికులు చేయడం హర్షణీయమన్నారు. అలాగే విశాఖ దక్షిణ నియోజకవర్గ నాయకులు డాక్టర్ మూగి శ్రీనివాసరావు మాట్లాడుతూ జనసేన అధినేత పవన్ కళ్యాణ్ జన్మదిన సందర్భంగా రక్తదానం శిబిరాలు ఏర్పాటు చేయడం జరిగిందనీ, ఈ కార్యక్రమంలో సుమారు 300 జనసైనికులు పాల్గొంటారనీ చెప్పారు. రక్తహీనతతో బాధపడుతున్న అనేక మందికి ఈ రక్తదానం ఉపయోగపడు తుందన్నారు. రక్తదానంతో పాటు అనేక సేవా కార్యక్రమాలు చేయడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో 41వ వార్డు జనసేన పార్టీ నాయకులు ఆంతోని శేఖర్, ఆశాజ్యోతి యాదవ్, 39వ వార్డు జనసైనికులు చిన్నా తదితరులు పాల్గొన్నారు.

# జగనన్న ఇళ్ల నిర్మాణ పనులు వేగవంతం చేయండి

## జాయింట్ కలెక్టర్ కె ఎస్ విశ్వనాథన్



విశాఖపట్నం (విజయభాను న్యూస్) : నవరత్నాలు-పేదలందరికీ ఇల్లు పథకంలో భాగంగా ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని జాయింట్ కలెక్టర్ కె ఎస్ విశ్వనాథన్ అన్నారు. గురువారం ఉదయం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఇంటి నిర్మాణ సామాగ్రి సరఫరాకు సంబంధించి విశాఖపట్నం , అనకాపల్లి జిల్లాలలో స్టోన్ క్రషర్స్ యజమానులు, సంబంధిత శాఖల అధికారులతో జాయింట్ కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో అర్బన్ ప్రాంతంలో నివాసం ఉంటున్న లబ్ధిదారులకు ఒక లక్ష గృహములు మంజూరు జరిగినట్లు తెలిపారు. గృహ నిర్మాణమునకు కావలసిన 20 టన్నుల ఇసుకను ఉచితంగా సరఫరా చేయుచు , నాణ్యమైన నిర్మాణ సామాగ్రి అనగా సిమెంటు, స్టీలు దర్వాజాలు, కిటికీలు, కరెంటు సామాగ్రి, సానిటరీ సామాగ్రి మరియు పెయింట్స్ మార్కెట్ ధరల కన్నా అతి తక్కువ ధరలకు ప్రభుత్వం వారిచే సరఫరా చేయబడుచున్నవని తెలిపారు. అందులో భాగంగా ఇంటి నిర్మాణమునకు కావలసిన పిక్క సరసమైన ధరలకు సరఫరా చేయుటకు స్టోన్ క్రషర్స్ యజమానులతో సమీక్షా జరుపగా వారు మార్కెట్ రేటు కన్నా తక్కువ ధరకు సరఫరా చేయుటకు అంగీకరించారన్నారు. ఈ సమావేశంలో గృహ నిర్మాణ సంస్థ పథక సంచాల కులు పి. శ్రీనివాసరావు, కార్యనిర్వాహక ఇంజనీర్ ఆర్. ప్రసంగరాజు , గనుల శాఖ ఉప సంచాలకులు డి.ఈ.వి.ఎస్.ఎస్.ఎన్ రాజు, గనుల శాఖ అదనపు సంచాలకులు పి.సుబ్రహ్మణ్యం, రోడ్లు, భవనాల శాఖ పర్యవేక్షక ఇంజనీర్ కే.జాన్ సుధాకర్, మరియు స్టోన్ క్రషర్స్ యజమానులు తదితరులు పాల్గొన్నారు.

# ఏయూతో అమెరికాకు చెందిన ఏసిఐఆర్ ఎంఓయూ

## - వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి




ఆంధ్రవిశ్వవిద్యాలయం, (విజయభాను న్యూస్) : ఆంధ్రవిశ్వవిద్యాలయంలో అమెరికాకు చెందిన ఎలియన్స్ ఫర్ కమర్షియలైజేషన్ అండ్ ఇన్నోవేషన్ రీసెర్చ్ (ఏసిఐఆర్) అవగాహన ఒప్పందం చేసుకుంది. గురువారం ఉదయం ఏయూ అమెరికన్ కార్నర్‌లో జరిగిన కార్యక్రమంలో వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి సమక్షంలో ఒప్పంద పత్రాలపై ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్,ఏసిఐఆర్ డైరెక్టర్ ఎరిక్ అజులే సంతకాలు చేశారు. ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలను, ఆవిష్కర్తలను తయారు చేసే వ్యవస్థను సంయుక్తంగా రెండు సంస్థలు ఏర్పాటు చేయడం, అభివృద్ధి చేయడం జరుగుతుంది. ఇంక్యుబేటర్‌లకు, ఇంక్యుబేటర్ మేనేజర్లకు ఏయూ పరంగా అవసరమైన శిక్షణ తరగతులను నిర్వహిస్తారు. ఏయూలో నెలకొల్పిన ఇంక్యుబేషన్ హబ్‌తో అనుసంధానమై ఏసిఐఆర్ పనిచేస్తుంది. స్టార్టప్‌కు సంబంధించిన కార్యక్రమాలు సంయుక్తంగా చేపట్టడం జరుగుతుంది. కార్యక్రమంలో ఏయూ ఇంక్యుబేషన్ సెంటర్ సిఈఓ రవి ఈశ్వరపు, అమెరికన్ కాన్సులేట్ ప్రతినిధి జోయ్ క్రిష్టోఫర్ తదితరులు పాల్గొన్నారు.

# గీతం జాతీయ స్థాయి మూట్‌కోర్టు పోటీలు ప్రారంభం



సాగర్‌నగర్ (విజయభాను న్యూస్) : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ లా ఆధ్వర్యంలలో జాతీయ స్థాయి మూట్ కోర్టు పోటీలు గురువారం ప్రారంభం అయ్యాయి. గీతం మూట్ మరియు అడ్వకసీ కమిటి ఆధ్వర్యంలో సెప్టెంబర్ 4వ తేదీ వరకు గీతం వ్యవస్థాపక అధ్యక్షులు స్వర్గీయ డాక్టర్ ఎం.వి.వి.ఎస్. మూర్తి పేరుతో ఈ పోటీలను వర్చ్యువల్ విధానంలో ప్రముఖ న్యాయ నిపుణల పర్యవేక్షణలో నిర్వహిస్తున్నారు. దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన 22కి పైగా ప్రముఖ న్యాయ విశ్వవిద్యాలయాల నుంచి దాదాపు 200 మంది న్యాయ విద్యార్థులు ఈ పోటీలలో పాల్గొనున్నారు.

కాగా పోటీలను లాంఛనంగా ప్రారంభించిన గీతం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ దయానంద సిద్దవట్టం మాట్లాడుతూ దేశంలోని విశ్వవిద్యాలయాలలో 20 సంవత్సరాల క్రిందటి వరకు మేధోహక్కుల (ఐపిఆర్) పై పెద్దగా అవగాహన లేదని ఐతే శాస్త్ర విజ్ఞానం పెరుగుతుండటం, ప్రభుత్వ ప్రత్యేక దృష్టి కారణంగా పేటెంట్ ధరఖాస్తుల సంఖ్య పెరుగుతోందన్నారు. ఐపిఆర్ చట్టాల కారణంగా మానవ జీవన ప్రమాణం పెంచే ఔషధాల ధరలు అందరికి అందుబాటులో వచ్చాయన్నారు. మేదో హక్కులకు పెరుగుతున్న ప్రాధాన్యత కారణంగా ఔషధ రంగంతో సహ వివిధ శాస్త్ర ప్రయోగశాలలు, విశ్వవిద్యాలయాలు ఐపిఆర్ విభాగాలను నెలకొల్పడం సహ నిపుణులను సహితం నియమించుకుంటున్నాయని తెలిపారు. మేధోహక్కులపై మూట్‌కోర్టు పోటీలను నిర్వహించడాన్ని ఆయన అభినందించారు. గీతం అధ్యక్షుడు ఎమ్.శ్రీభరత్ మాట్లాడుతూ సామాన్యులకు సహితం న్యాయం జరుగుతుందన్న నమ్మకాన్ని న్యాయవ్యవస్థ ద్వారా ప్రజలలో పెంచాల్సిన బాధ్యత యువతరంపై ఉందన్నారు.

విశాఖ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వి.రవీంద్ర ప్రసాద్ మాట్లాడుతూ న్యాయ విద్యను అభ్యషించే యువతకు వృత్తిలో ప్రవేశించడానికి ముందు ప్రాక్టికల్ శిక్షణగా మూట్‌కోర్టు పోటీలు ఉపయోగ పడతాయన్నారు. నవ సమాజ నిర్మాణానికి పటిష్టమైన న్యాయవ్యవస్థ అందుకు తగ్గ నిపుణులు అవసరమన్నారు. చట్టాలను లోతుగా అర్ధం చేసుకుని సందర్భానికి తగిన విధంగా అన్వయించుకోవడానికి తగ్గ నైపుణ్యం మూట్ కోర్టు పోటీల ద్వారా కలుగుతుందన్నారు. విద్యార్థుల మద్య జరిగే చర్చల ద్వారా నూతన ఆలోచనలకు మార్గం ఏర్పడుతుందని తెలిపారు. గీతం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డి.గుణశేఖరన్ మూట్‌కోర్టు పోటీల నిర్వహణ ద్వారా విద్యార్థుల ప్రతిభను వెలికి తీయవచ్చునన్నారు. గీతం న్యాయ కళాశాల డైరక్టర్ ప్రొఫెసర్ అనితారావు మాట్లాడుతూ న్యాయ వృత్తిలో పాటించాల్సిన మెళకువలుపై విద్యార్థులకు ప్రాక్టికల్ అనుభవాన్ని అందించడంతో పాటు, వాదోపవాదాలపై న్యాయస్థానంలో వృత్తి నైపుణ్యాన్ని పెంచటానికి ఈ మూట్ కోర్టు పోటీలను గత మూడు సంవత్సరాలుగా నిర్వహిస్తున్నామని తెలిపారు. మేధోహక్కులపై ఈ ఏడాది మూట్ కోర్టు పోటీని సెప్టెంబర్ 4వ తేదీవరకు నిర్వహిస్తున్నామన్నారు. విజేతలకు నగదు బహుమతులు అందజేస్తామన్నారు.

# విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణుకు కేబినెట్ హోదా



**విజయవాడ,** : అమరావతి: ఆంధ్రప్రదేశ్ ప్లానింగ్ బోర్డ్ వైస్ ఛైర్మన్‌గా విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు నియమితులయ్యారు. ఈ మేరకు ఆయనకు కేబినెట్ హోదాను కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీచేసింది. రెండేళ్ల పాటు ప్లానింగ్ బోర్డు వైస్ ఛైర్మన్ పదవిలో మల్లాది విష్ణు కొనసాగనున్నారు.

# కృత్రిమ టాంక్ ప్రారంభోత్సవం... మ్యూజియం సందర్శన

## పలు గణేష్ మండపాల వద్ద ఎమ్మెల్సీ వంశీకృష్ణ యాదవ్





విశాఖపట్నం (విజయభాను న్యూస్) :

బీచ్ కు వెళ్లకుండా ఇంటి వద్దే వినాయక నిమజ్జనానికి జీవీఎంసీ ఏర్పాటు చేసిన కృత్రిమ టాంక్ లను 21 వార్డ్ పరిధిలో గల విశాఖ మ్యూజియం వద్ద అపార్ట్మెంట్ వద్ద ఎమ్మెల్సీ వంశీకృష్ణ యాదవ్ గారు ప్రారంభించారు. కార్యక్రమంలో మాట్లాడుతూ 3 అడుగుల ఎత్తు వరకు గల వినాయక విగ్రహాలను నిమజ్జనం చేసుకునేలా ఏర్పాటు చేశారని, పర్యావరణానికి మేలు చేసేలా విన్నూత్న చర్యలు చేపట్టిన జీవీఎంసీ అధికారులను అభినందించారు. అనంతరం విశాఖ మ్యూజియంను సందర్శించారు. పురాతన వస్తువులను మరియు రక రకాల ఫోటోలను తిలకించారు.

సందర్శిన అనంతరం మాట్లాడుతూ భావితరాలకు ఇప్పటివరకు మనం సాధించిన ఘనతను, విజయాలను యువతరం తెలియజేయుటకు మ్యూజి యం వంటివి ఎంతో కీలకపాత్ర వహిస్తా యని తెలిపారు.

అనంతరం శ్రామికనగర్ లో ఏర్పాటు చేసిన గణేష్ మండపాన్ని సిబిఐ డౌన్లో ఏర్పాటు చేసిన గణేష్ మండపాన్ని సందర్శించి, స్వామివారి ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా అనేక మంది యువత, భక్తులు, వార్డ్ అధ్యక్షుడు రవికుమార్, యువజన నాయకులు సంతోష్, శ్రీధర్ , gvmc అధికారులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

# సి.ఎం.ఆర్. సంస్థ వాటర్ ప్లాంట్ వితరణ



విశాఖపట్నం (విజయభాను న్యూస్) :

డా. వి.ఎస్. కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాల వారి విన్నపం మేరకు విద్యార్థులకు త్రాగునీటి సౌకర్యార్థం సి.ఎం.ఆర్. సంస్థల అధినేత మావూరి వెంకటరమణ కాలేజకు వాటర్ ప్లాంట్ ను సుమారు 2.5 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసి సెప్టెంబరు 1వ తేదీన కళాశాలలో ప్రారంభోత్సవం చేయటం జరిగినది.

ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ బి.సుజాత మాట్లాడుతూ విద్యార్థులకు ఉపయోగ కరంగా ఉండే వాటర్ ప్లాంట్ సమకూర్చి నందుకు సి.ఎం.ఆర్. సంస్థల అధినేత మావూరి వెంకటరమణ కి కృతజ్ఞ తలు తెలిపి సాలువాతో సత్కరిం చారు. కళాశాల అధ్యాపకుల అభ్యర్థన మేరకు కళాశాలకు ఉపయోగపడే ఇతర పనులు చేపటతామని మావూరి వెంకటరమణ హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో ఎన్.సి.సి. ఆఫీసర్ బి. సన్యాసిరావు , లైబ్రేరియన్ రాజశేఖర్ రెడ్డి , హేమంత్, నాగమణి, పుష్పలత మొదలగు టీచింగ్ & నాన్ టీచింగ్ సిబ్బంది మరియు విద్యార్థులు పాల్గొన్నారు.



# భారత్-చైనా సైనికాధికారుల స్థాయి చర్చలు



న్యూఢిల్లీ : వాస్తవాధీన రేఖ వద్ద పలు చోట్ల నెలకొన్న ఘర్షణాత్మక వాతావరణాన్ని చల్లబర్చేందుకు భారత్-చైనా సైనికాధి కారులు చర్చలు జరిపారు. మేజర్ జనరల్ స్థాయి అధికారులు వీటిల్లో పాల్గొన్నారు. దెమ్‌చోక్ వద్ద భారత పశువుల కాపర్లను పీఎల్‌ఏ దళాలు అడ్డుకొంటున్న సమయం లో ఈ చర్చలు జరగడం గమనార్హం. ఈ చర్చలపై ఇరు పక్షాల నుంచి ఎటువంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. ఇప్పటికే ఇరు పక్షాలు కోర్ కమాండర్ స్థాయిలో 16 విడతలు చర్చలు జరిపాయి. ఈ చర్చలు కొంత ఫలితాన్నిచ్చి పాంగాంగ్ సరస్సు, గోగ్రాపోస్టు వద్ద బలగాల ఉపసంహరణ జరిగింది. ఆసియా సొసైటీ పాలసీ ఇన్‌స్టిట్యూట్‌లో ఇటీవల జరిగిన ఓ కార్యక్రమంలో విదేశాంగ శాఖ మంత్రి ఎస్. జైశంకర్ మాట్లాడుతూ.. భారత్-చైనా సరిహద్దులే ఇరు దేశాల సంబంధాలను ప్రతిబింబిస్తాయని వ్యాఖ్యానించారు.

ఇక్కడ సంబంధాలు సాధారణ స్థితికి రావడానికి పరస్పరం అర్థం చేసుకోవడం.

గౌరవించుకోవడం, ప్రయోజనాలు కాపాడుకోవడం వంటివి జరగాలని ఆయన అభిప్రాయపడ్డారు. చర్చలకు ముందు జైశంకర్ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకొన్నాయి.

VIJAYABHANU - Visakhapatnam
Editor : B. Chandra Sekhar, Printed and Published by him on behalf of **VIJAYABHANU PUBLICATIONS .,** Published and Printed at **VIJAYABHANU PRESS,** D.No. 9-3-17, Pithapuram Colony, Visakhapatnam - 530 003.
R.N.I. No. 32157/77. Postal Regd. No. J/VM-RNP/32 ⋆ Phone : 2564353, Fax : 0891-2569004 ⋆ e-mail: vijayabhanudaily@gmail.com